ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ప్రకాశం

జిల్లా వార్తలు

గురువారం 24, జూలై 2025



జయహో..

ఒంగోలులో బుధవారం దేశభక్తి ఉప్పొంగింది. జాతీయతా భావం వెల్లివిరిసింది. గిన్నిస్ బుక్‌లో రికార్డు సాధన లక్ష్యంతో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో 3,600 అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నాలుగు వేల మంది విద్యార్థులతో నగరంలో పతాక ప్రదర్శన చేపట్టారు.

వివరాలు మెయిన్‌లో..



తాళ్లూరులో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన గృహాలు ఉన్న ప్రాంతం

ఏడేళ్లుగా ఏడు గ్రామాల్లో నిలిచిన రిజిస్ట్రేషన్లు

మండలంలోని ఏడు గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు ఏడేళ్లుగా నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లూరు, బొద్దికూరపాడు, నాగంబొట్లపాలెం, లక్కవరం, రామభద్రాపురం, సోమవరప్పాడు, బెల్లంకొండవారిపాలెం, శివరాంపురంలలో గ్రామకంఠానికి చెందిన పలు సర్వే నంబర్లలోని గృహాలను దేవుని ఆస్తిగా దేవదాయశాఖ అధికారులు నిషేధిత చట్టం 22-(ఏ) జాబితాలోకి చేర్చారు. అప్పటి అధికారులు దేవుళ్ల ఆస్తులను సబ్ డివిజన్ చేయలేదు. దీంతో ఆన్‌లైన్ చేసే సమయంలో ఆలయ భూములు ఉన్న సర్వే నంబర్లన్నింటినీ 22-ఏ జాబితాలో చేర్చారు. వీటి రిజిస్ట్రేషన్లు నిలిపివేసేందుకు ప్రభుత్వానికి లేఖ ఇవ్వడంతో పైఅధికారులు గుడ్డిగా నిలిపివేశారు. ఆ శాఖ ఉన్నతాధికారి పరిశీలించి లిఖితపూర్వకంగా అందజేస్తే మిగిలిన భూమికి అనుమతులు ఇస్తామని సబ్ రిజిస్ట్రార్ పలుమార్లు దేవదాయ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకున్న నాథుడే లేరని గృహ యజమానులు వాపోతున్నారు.

దేవా.. విడువవా!

దేవదాయ శాఖ అధికారుల అతి వ్యవహారం, నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. కోట్ల విలువ చేసే భూములను దేవుడి సొత్తుగా నమోదు చేసుకున్నారు. దీంతో తమ ఆస్తులను క్రయవిక్రయాలు చేసుకునేందుకు అందరూ పడరానిపాట్లు పడుతున్నారు. ఈ సమస్య జిల్లావ్యాప్తంగా నెలకొన్నప్పటికీ తాళ్లూరు మండలంలో అధికంగా ఉంది. కోట్ల విలువ చేసే ఆస్తులను సైతం వినియోగించుకోలేని దుస్థితిలో ఉన్నామని ఆయా గ్రామాలకు చెందిన బాధితులు వాపోతున్నారు. చేసిన తప్పులను సరిదిద్ది తమ ఆస్తులు తమ పేరున ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఇబ్బందులు పెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

- నిషేధిత జాబితాలో గ్రామకంఠం ఆస్తులు
- అధికారుల తప్పిదంతో దేవుడివిగా నమోదు
- ఏడు సంవత్సరాలుగా నిలిచిన రిజిస్ట్రేషన్లు
- పట్టించుకోని వైనం
- ప్రజలకు ఇబ్బందులు



తాళ్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అసలు ఎటువంటి సంబంధం లేని ఆస్తులను దేవదాయశాఖ అధికారులు దేవుళ్లకు చెందినవిగా 22-ఏ నిషేధిత జాబితా రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో వాటిని విడిపించుకోలేక బాధిత రైతులు, గృహ యజమానులు అల్లాడుతున్నారు. దేవదాయ శాఖ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినా వారి సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారు. జిల్లావ్యాప్తంగా ఈ విధంగా వందల కొద్దీ వివాదాలు ఉన్నాయి. వీటిపై కోర్టుల తలుపుతట్టి గెలిచిన వారూ ఉన్నారు. అయినా ఆ శాఖ అధికారుల తీరు మాత్రం మారడం లేదు. భూబాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం, ఏదో ఒకవిధంగా సమస్యను పరిష్కరిస్తామంటూ వారి వద్ద ఆమ్యామ్యాలు పుచ్చుకోవడం మామూలే అయ్యింది. అయినా పరిష్కారం అవుతున్న కేసులు వేళ్ల మీదనే లెక్కపెట్టవచ్చు.

నిషేధిత జాబితాలో చేర్చిన సర్వే నంబర్లు

తాళ్లూరులోని గ్రామకంఠం సర్వేనంబర్ 268లోని ఆస్తులు శ్రీవేణుగోపాల, రామలింగేశ్వరస్వామి, శ్రీఆంజనేయస్వాములకు చెందినవిగా నమోదయ్యాయి. నాగంబొట్లపాలెం గ్రామకంఠం 505 సర్వేనంబర్‌లోని ఆస్తులు శ్రీ సీతారామస్వామి పేరు మీద, బెల్లంకొండవారిపాలెం గ్రామ కంఠం సర్వే నంబర్ 9లోని ఆస్తులు సీతారామస్వామి పేరు మీద ఉన్నాయి. బొద్దికూరపాడు గ్రామకంఠ సర్వే నంబర్ 114లోని ఆస్తులను శ్రీసోమేశ్వర, జ్వాలాముఖి అమ్మవార్ల పేరు మీద నమోదు చేశారు. 115లోని గ్రామకంఠం ఆస్తులను శ్రీ మాధవస్వామి పేరు మీద, లక్కవరం గ్రామకంఠం 193/3లోని ఆస్తులను శ్రీమల్లేశ్వర వీరభద్రయ్య, శ్రీరామలింగేశ్వర స్వాముల

మిగతా 6వ పేజీలో

కొండపి, మంగమూరు పంచాయతీలకు

రిజర్వేషన్లు ఖరారు

- రెండు సర్పంచ్‌లూ ఎస్సీ మహిళకు కేటాయింపు
- వార్డులకూ రిజర్వేషన్లు ప్రకటన
- ఎన్నికల అధికారులను నియమించేందుకు చర్యలు
- ఇప్పటికే పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల

ఒంగోలు కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మండల కేంద్రమైన కొండపి, సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామ పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించేందుకు ఇప్పటికే ఈసీ ఆదేశాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రచురించారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరించి ఈనెల 17న తుది జాబితా ప్రచురించారు. మరోవైపు పార్టీల ప్రతినిధులతో సమావేశాలను నిర్వహించారు. తదనుగుణంగా ఇప్పటికే రెండు గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్లను కూడా ఖరారు చేశారు. కొండపి, మంగమూరు పంచాయతీల సర్పంచ్ పదవులను ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. కొండపిలో 6,678 మంది ఓటర్లు ఉండగా 14 వార్డులుగా విభజించారు. ఒక్కో వార్డులో 477 మంది ఓటర్లు ఉన్నారు. మంగమూరు పంచాయతీలో 3,252 మంది ఓటర్లు ఉండగా 12 వార్డులుగా విభజించారు. ఆయా వార్డులకు కూడా రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం స్టేజ్-1, స్టేజ్-2 అధికారులను నియమించేందుకు జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే నిర్వహణకు అవసరమైన కసరత్తును ప్రారంభించనున్నారు.



కొండపి పంచాయతీ కార్యాలయం



దోర్నాలలోని సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

పశ్చిమాన పండుగ

- 26న మంత్రులు, కీలక ప్రజాప్రతినిధుల పర్యటన
- దోర్నాలలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొననున్న నలుగురు మంత్రులు, ఎమ్మెల్యేలు
- మార్కాపురంలో జిల్లా విజన్ ప్లాన్‌పై సమీక్ష
- ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

ఒంగోలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశ్చిమప్రాంతంలో ఈనెల 26న పలువురు మంత్రులు, ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు పర్యటించనున్నారు. ఆరోజు ఉదయం ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని దోర్నాలలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరగనుంది. అందుకోసం ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి

మిగతా 6వ పేజీలో

వారంలో ఒక్కరోజూ చెత్త తీయరు మేడం..!

కలెక్టర్‌కు ప్రజల ఫిర్యాదు

- నగరంలో అన్సారియా ఆకస్మిక పరిశీలన
- పారిశుధ్యం అధ్వానంపై అధికారులపై ఆగ్రహం



ఒంగోలులోని కోటవీధిలో మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కార్పొరేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 'ఒకరోజు కాదు.. రెండు రోజులు కాదు మేడం.. వారం రోజులకు ఒకసారి కూడా చెత్త తీయడం లేదు. ఇళ్లలోది తీసుకెళ్లరు.. కాలువల్లో మురుగు తొలగించరు! అడిగితే పట్టించుకోరు. ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. నాలుగు నెలల నుంచి పారిశుధ్యం గురించి పట్టించుకున్నవారే లేరు' అని పలువురు నగరవాసులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ తీరును కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. శానిటేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం

మిగతా 6వ పేజీలో



ఆన్‌లైన్లో 75 మంది.. క్లాసులో నలుగురే!

- ఆరుగురు ఉపాధ్యాయులకు జీతాలు
- డీఈవో, డిప్యూటీ ఈవో తనిఖీల్లో తేటతెల్లం
- రికార్డులు చూపని కరస్పాండెంట్

కొమరోలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేద విద్యార్థులకు విద్యనందించాలన్న ఉద్దేశంతో ఎయిడెడ్ పాఠశాలలకూ గుర్తింపు నిచ్చింది. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు జీతాలు చెల్లిస్తున్నా విధులు మాత్రం సక్రంగా నిర్వర్తించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల హాజరుకు సంబంధించి ఆన్‌లైన్‌లో 75మంది ఉండగా, క్లాస్‌కు మాత్రం నలుగురు విద్యార్థులే హాజరుకావడం సాక్షాత్తు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో వెలుగు చూసింది. అధికారులు తెలిపిన వివరాల మేరకు కొమరోలులోని ఏబీఎం ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో

మిగతా 6వ పేజీలో



కొమరోలు పాఠశాలలో విచారిస్తున్న డిప్యూటీ ఈవో శ్రీనివాసరెడ్డి

శాకంబరిగా పార్వతీ త్రిపురాదేవి

ఆషాఢం చివరి రోజు సందర్భంగా త్రిపురాంతకంలోని పార్వతీ త్రిపురాదేవి సమేత త్రిపురాంతకేశ్వరుని ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి శాకంబరి అలంకరణ చేసి సారె సమర్పించారు. అనంతరం స్వామివారికి ఘటాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

\- ఆంధ్రజ్యోతి, త్రిపురాంతకం



నకిలీ పాసుపుస్తకాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్, ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో మోసం

- అమాయకులైన వారి బ్యాంక్ ఖాతాలతో వ్యాపారం
- ఇతర దేశాల వారితో చేతులు కలిపిన నెల్లూరు వాసి
- ఆరుగురు అరెస్టు, మరికొందరి కోసం గాలింపు

వివరాలు మెయిన్‌లో..

50 ఏళ్ల మురుగు సమస్యకు మోక్షం



నిర్మాణం చేపట్టాక సాఫీగా వెళ్తున్న మురుగు నీరు

మాట నిలబెట్టుకున్న మంత్రి స్వామి

రూ.50 లక్షలతో బైరాగిమన్యం నుంచి ట్రంకురోడ్డు వరకు కాలువ నిర్మాణం

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సింగరాయకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఐదు దశాబ్దాల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న మురుగు సమస్యకు మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతో మోక్షం లభించింది. గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఆయన ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన ఏడాది లోపు నెరవేర్చి ప్రజలతో శభాష్ అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బైరాగి మన్యం నుంచి ట్రంకురోడ్డు వరకు ప్రధాన కాలువను దాదాపు 50 ఏళ్ల నుంచి పట్టించుకున్న నాథుడు లేరు. ఈ కాలువ నుంచి బైరాగిమాన్యంతోపాటు మూలగుంటపాడు విద్యానగర్, ఈద్గామిట్టకు చెందిన మురుగు నీరు ప్రవహిస్తోంది. కాలువ వెడల్పుగా, లోతుగా ఉన్నప్పటికీ ఏళ్లుగా పూడిక తీయలేదు. దీంతో మురుగు పేరుకుపోయింది. ఈ కాలువ ఇళ్ల మధ్యలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాలువ నుంచి వచ్చే దుర్వాసన, దోమల ధాటికి తరుచూ రోగాలబారిన పడేవారు. గత ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే స్వామి ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో స్థానికులు మురుగు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన కాలువను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత కాలువ నిర్మాణానికి రూరల్ అర్బన్, ఎన్ఆర్ఈజీఏ పథకం కింద రూ.50 లక్షలు మంజూరు చేయించారు. టీడీపీ సీనియర్ నేత కూనపరెడ్డి సుబ్బారావు పనులు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా కాలువలో పేరుకుపోయిన మురుగును తొలుత ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అనంతరం నూతన కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే మెజారిటీ భాగం పూర్తి చేయడంతో మురుగు నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్తోంది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలువ నిర్మించక ముందు పేరుకుపోయిన మురుగు (ఫైల్)



కాలువలో పేరుకుపోయిన మురుగును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్ (ఫైల్)



డప్పు కళాకారుల సమితి అధ్యక్షుడిగా అన్నోజీరావు

గిద్దలూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మాదిగ చర్మ, డప్పు కళాకారుల పోరాట సమితి అధ్యక్షుడిగా రాచర్ల మండలం సంగపేట గ్రామానికి చెందిన కత్తి అన్నోజీరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరుగగా సమావేశంలో అన్నోజీరావును అధ్యక్షుడిగా, గుర్రం డానియేలును ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు పందీటి రజనీబాబు, మండల అధ్యక్షుడిగా గొట్టం నాగయ్య, రాచర్ల మండల అధ్యక్షుడిగా చిట్టెం భాస్కర్, అర్ధవీడు మండల అధ్యక్షుడిగా దున్నా ఏబు ఎన్నికయ్యారు. నియోజకవర్గ పాస్టర్స్ అధ్యక్షులుగా తప్పెట ఇస్మాయిల్, సభ్యులుగా పూసపాటి విజయ్‌కుమార్, కొమ్మునూరు ఏసయ్య, పుల్లయ్యలను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

17 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎర్రగొండపాలెం, జూలై 23 : నియోజకవర్గంలో వివిధ వ్యాధులకు శస్త్ర చికిత్సలు చేయించుకున్న 17 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.22,56,352లక్షల చెక్కులను బుధవారం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు టీడీపీ కార్యాలయంలో పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం ఆపన్న హస్తం అని ఎరిక్షన్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు అనుమాలశెట్టి సుబ్బారావు, కొత్త మాసు సుబ్రమణ్యం, చిట్యాల వెంగళరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంలో మోతాదులో ఎరువు వాడాలి



అరటి పంటను పరిశీలిస్తున్న హెచ్‌వో శ్వేత

రాచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పండ్ల తోటల పెంపకంలో సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువును వాడాలని ఉద్యాన శాఖ అధికారి డీ సాయి శ్వేత అన్నారు. మండలంలోని జేపీచెరువు, చిన్నగానిపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె అరటి సాగును పరిశీలించారు. సిగటోగా ఆకుమచ్చ తెగులు పంటలో ఎక్కువగా ఉందని, ఇది అన్ని కాలాల్లో ఉంటుందని నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తెగులు ఎక్కువగా సోకే రకాలపై మంకోజెట్ 2.5గ్రాముల మందును లీటర్ నీటిలో పిచికారీ చేయాలన్నారు. తెగులు వ్యాప్తి పెరిగితే ప్రాపికనాజోల్ 1 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి రెండు మూడు సార్లు 20రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. పంట రక్షణకు చుట్టూ మొక్కజొన్న విత్తుకోవాలన్నారు. తామర పురుగు, తెల్లదోమ నియంత్రణకు నీలం, పసుపు రంగు జిగురు అట్టలు ఒక్కో ఎకానికి 20 వాడాలన్నారు.

కంది విత్తనాల పంపిణీ

పొదిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంచేపల్లి గ్రామంలో రైతులకు సామూహిక ప్రదర్శన క్షేత్రాల పథకం కింద దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 100 ఎకరాలకు ఎల్ఆర్జీ 52 (అమరావతి) విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ ఎల్ ఆర్జీ 52 రకం కంది పంట కాలం 160 నుంచి 170 రోజులు పంటకాలం ఉంటుందని ఎకరాకు 6క్వింటాళ్ల దిగుబడితో ఎండు తెగులును తట్టుకుందన్నారు. తట్టుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో పొదిలి వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

26న శ్రీమద్భాగవత సప్తాహం

పామూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తూర్పువీధిలోగల శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో శనివారం శ్రీ మద్భాగవత సప్తాహం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కురిమేటి బాలసుబ్రహ్మణ్యం శాస్త్రితో ప్రవచనం జరుగుతుందని తెలిపారు.

గురుకుల పాఠశాలలో 10వ తరగతిలోకి దరఖాస్తుల ఆహ్వానం

కురిచేడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. ఆరోన్ బాబు కోరారు. 10వ తరగతిలో ప్రవేశం పొందాలంటే 9వ తరగతి పూర్తి అయి ఉండాలని, 60 శాతం మార్కులు సాధించి ఉండాలని అన్నారు. ఆసక్తి కలవారు తమ ఆధార్ కార్డుతో కురిచేడులోని గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆరోన్‌బాబు కోరారు.

లక్ష్మీసెహగల్ స్ఫూర్తితో ఉద్యమాలు

ముండ్లమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : దేశ స్వాతంత్ర్య పోరాటంలో కెప్టెన్ లక్ష్మీ సెహగల్ దీర వనితగా నిలిచారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని మారెళ్లలో వెల్లంపల్లి మల్లేశ్వరి అధ్యక్షతన లక్ష్మీ సెహగల్ వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమంలో టీ కాశమ్మ, నారాయణ, చంద్రమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ రానివారు గ్రీవెన్స్‌లో పెట్టుకోవాలి

మేదరమెట్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత ఉండి లబ్ధిదారుల జాబితాలో పేర్లు రాని వారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని మండల వ్యవసాయ అధికారి రామ్‌మోహన్‌రెడ్డి చెప్పారు. బుధవారం కొరిశపాడు, బొల్లవరప్పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం పొడిగించారన్నారు. ఈ పథకం కింద పత్తి, వేరుశనగ పంటలకు బీమ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. పత్తి పంట సాగు చేసిన రైతులు పంట ధ్రువీకరణ పత్రం తీసుకుని సీఎస్సీ కేంద్రాల్లో పంటల బీమా చేయించుకోవాలన్నారు. తేమ 20శాతంలోపు ఉన్న పొగాకు చెక్కులను కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని చెప్పారు.

విద్యార్థుల కోసం బస్సు ఏర్పాటు

● మంత్రికి ఆలకూరపాడు గ్రామస్థుల కృతజ్ఞతలు

టంగుటూరు (కొండపి), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలకూరపాడు జడ్పీస్కూల్‌లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ ఏడాది అధికంగా చేరారు. వారి కోసం బడి వేళల్లో ప్రత్యేకంగా బస్సును నడపాలని గ్రామస్థులు మంత్రి స్వామికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. బుధవారం నుంచి టంగుటూరు, వెలగపూడి, తాళ్లపాలెం మీదుగా అనంతవరం గ్రామానికి బస్సును నడిపారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సును ఏర్పాటు చేసిన మంత్రి స్వామికి, ఆర్టీసీ అధికారులకు హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పశ్చిమాన పండుగ

(5వ పేజీ తరువాయి)

గుడూరి ఎరిక్షన్‌బాబు నేతృత్వంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. చాలాకాలం క్రితమే ఆ కార్యక్రమం జరగాల్సి ఉండగా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 4న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యక్రమానికి హాజరైన అనంతరం అక్కడే ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జిల్లా టీడీపీ సమావేశం నిర్వహించారు. అందులో 26న దోర్నాలలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఖరారు చేశారు. ఇన్‌చార్జి మంత్రి ఆనం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్‌లతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వంటి ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. ఆమేరకు కార్యక్రమంపై స్పష్టత రాగా తదనుగుణంగా భారీ ఏర్పాట్లు ఎరిక్షన్‌బాబు నేతృత్వంలో జరుగుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణులతోపాటు పెద్దసంఖ్యలో గిరిజన గ్రామాల ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్కాపురంలో డీవీఏపీ సమావేశం

దోర్నాలలో కార్యక్రమం అనంతరం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలకమైన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ (డీవీఏపీ) యూనిట్ సమావేశం జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా విజన్-2047లో భాగంగా 2029 నాటికి చేపట్టే కార్యక్రమలపై జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తోంది. వాటి ద్వారా ప్రభుత్వం ప్రస్తుతం చేపట్టిన పీ4 కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించడం ద్వారా పేదరిక నిర్మూలన లక్ష్యం నెరవేర్చాలని నిర్ణయించారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సమావేశాలు జరిగాయి. ఇక్కడ ఈనెల 8న నిర్వహించాలని తొలుత నిర్ణయించిన కలెక్టర్ సెలవులో ఉండటంతో వాయిదా పడింది. ఆ సమావేశాన్ని 26న తిరిగి ఏర్పాటు చేశారు. ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో ఈ సమావేశం జరగాల్సి ఉన్నప్పటికీ 26న ముఖ్యమైన ప్రజాప్రతినిధులంతా దోర్నాల సభకు హాజరుకానుండటంతోపాటు సమావేశం ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన జరగాల్సి ఉండటంతో దోర్నాల కార్యక్రమం అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమేరకు ఇన్‌చార్జి మంత్రి ఆనం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించడంతో తదనుగుణ ఏర్పాట్లపై అధికారులు చర్యలు చేపట్టారు.

దేవా.. విడువవా!

(5వ పేజీ తరువాయి)

పేరున, సోమవరప్పాడు గ్రామకంఠం సర్వేనంబర్16లోని ఆస్తులను శ్రీవీరాంజనేయస్వామి పేరున, శివరాంపురం గ్రామ కంఠం సర్వే నంబర్ 110లోని ఆస్తులను శ్రీవేణుగోపాల, ప్రతాపఆంజనేయస్వామి పేరున 22ఏ నిషేధిత చట్టంలో నమోదు చేశారు. వీటన్నింటి రిజిస్ట్రేషన్‌లను నిలుపుదల చేస్తూ దేవదాయశాఖ అధికారులు దర్శి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా లేఖ అందజేశారు. దేవాలయాలు ఉన్న విస్తీర్ణాన్ని గుర్తించడంలో అప్పటి దేవదాయశాఖ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. దేవాలయాలు ఉన్న విస్తీర్ణాన్ని కొలతలు తీసి సబ్ డివిజన్ చేయకుండా ఆ సర్వే నంబర్ పూర్తి విస్తీర్ణాన్ని 22ఏలో చేర్చారు. దీంతో గ్రామకంఠంకు చెందిన సగ భాగానికి పైగా గృహాలు దేవుడికి చెందిన ఆస్తులుగా నమోదయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ఇంటి యజమానులు రిజిస్ట్రేషన్లు జరగక పడరానిపాట్లు పడుతున్నారు. అప్పటి దేవదాయశాఖ అధికారులు ఆ గ్రామాల్లోని గ్రామకంఠం ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చామని పేర్కొంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి జూన్ 4, 2016న లేఖ పంపడంతో గృహాల అమ్మకాలు, కొనుగోళ్లు నిలిచిపోయాయి.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు ఇచ్చినా లభించని పరిష్కారం

రాష్ట్రప్రభుత్వం అట్టహాసంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పిన మాటలు అమలుకు నోచుకోలేదు. దేవుడి ఆస్తులుగా 22-ఏలో చేరి ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామాల రైతులు, సమస్యలను పరిష్కరించాలన్న తలంపుతో దేవుని ఆస్తులను సర్వే చేసి గుర్తించాలని దేవదాయ ఈవో ప్రతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు పెట్టారు. ఆ మేరకు రెవెన్యూ సర్వేయర్లు, ఎండోమెంట్ అధికారులు జాయింట్‌గా కొలతలు తీసి సబ్‌డివిజన్లు చేసి ఉన్నతాధికారులకు పంపారు. అయినా నేటికీ ప్రజల ఆస్తులు 22-ఏ నుంచి విముక్తి లభించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని 22ఏ నుంచి సొంత ఆస్తులకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

అధికారుల తప్పిదంతో ఇబ్బందిపడుతున్నాం

పూర్వీకుల నుంచి మాకు ఆస్తి సంక్రమించింది. రిజిస్ట్రేషన్‌లు కూడా ఉన్నాయి. అధికారులు బాధ్యతారాహిత్యంగా తమకు చెందిన గ్రామకంఠం ఆస్తులను కూడా 22-ఏలో చేరుస్తున్నట్లు రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ ఇచ్చారు. దీంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. అగ్రిమెంట్‌లపై క్రయ, విక్రయాలు చేయకూడదని తెలిసినా రిజిస్ట్రేషన్లు జరగకపోవటంతో అగ్రిమెంట్‌పై కొనుక్కొంటున్నారు. ఏడేళ్లుగా వేధిస్తున్న ఈసమస్యను త్వరగా పరిష్కరించి ఇబ్బందులు తొలగించాలి.

\- చందోలు రామారావు, తాళ్లూరు

పిల్లల చదువులు ఆగిపోతున్నాయి

పూర్వీకుల నుంచి రిజిస్ట్రేషన్ ద్వారా సంక్రమించిన ఆస్తులు నిషేధిత 22 -ఏలో రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. ప్రజలు సొంత స్థలాల్లో గృహాల నిర్మించుకునేందుకు బ్యాంక్‌ల వద్దకు వెళితే రికార్డుల్లో 22-ఏలో నమోదయిందంటూ రుణాలు ఇవ్వడం లేదు. సొంత ఆస్తులకు అడ్డుగా ఉన్న 22-ఏను తొలగించి రిజిస్ట్రేన్లకు అనుమతించాలి. అధికారులు చేసిన పొరపాటుతో సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.

\- రాచకొండ వెంకట్రావు, బెల్లంకొండవారిపాలెం

వారంలో ఒక్కరోజు కూడా చెత్త తీయరు మేడం..!

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఒంగోలు నగరంలో కలెక్టర్ బుధవారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోట వీధి, బలరాం కాలనీ, మిలటరీ కాలనీ, దిబ్బల రోడ్ తదితర ప్రాంతాల్లో తిరిగారు. ఈ సందర్భంగా పారిశుధ్యం ఎలా ఉంది అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కనీసం వారానికి ఒకరోజు కూడా ఇళ్లలో చెత్త తీసుకెళ్లడం లేదని, కాలువలు బాగు చేయడం లేదని కలెక్టర్‌కు వారు ఫిర్యాదు చేశారు. దీంతో శానిటేషన్ అధికారులను కలెక్టర్ ప్రశ్నించగా, కార్మికులు సమ్మెలో ఉన్నారనే సమాధానం రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె ఈ పదిరోజులే కదా.. ఐదారు నెలల నుంచి చెత్త తీయడం లేదని ప్రజలు చెబుతున్నారని ప్రశ్నించారు. హెల్త్ ఆఫీసర్ ఏమి చేస్తున్నారు. శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు ఏమి చేస్తున్నారంటూ మండిపడ్డారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించాలని కార్పొరేషన్ అధికారులను కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. పారిశుధ్యం మెరుగునకు డివిజన్‌ల వారీగా ప్రణాళిక రూపొందించాలని కమిషనర్ వెంకటేశ్వరరావుకు సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, గున్యా వంటివి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి పాల్గొన్నారు.

ఆన్‌లైన్లో 75 మంది.. క్లాసుకు వచ్చింది నలుగురే

(5వ పేజీ తరువాయి)

ఆరుగురు ఉపాధ్యాయులకు ప్రభుత్వం సుమారు రూ.6లక్షలు జీతాల రూపంలో చెల్లిస్తోంది. కానీ ఇక్కడ మాత్రం ఆన్‌లైన్లో 75మంది ఉండగా, మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి తనిఖీల్లో కేవలం నలుగురు మాత్రమే కన్పించారు. బుధవారం మార్కాపురం డిప్యూటీ ఈవో పాఠశాలను తనిఖీచేయగా ఏడుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. డీఈవో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల తనిఖీకి వెళ్లినప్పుడు కరస్పాండెంట్ లేరని, రికార్డులను చూపించకపోవడంతో హెచ్ఎం సుబ్బారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీనిపై పూర్తి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. దీంతో బుధవారం డిప్యూటీ ఈవో శ్రీనివాసరెడ్డి పాఠశాలను సందర్శించినా కరస్పాండెంట్ రికార్డులను చూపించలేదు. తనిఖీలు చేస్తున్న సమయంలో ఏబీఎం ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్లో 75మంది ఉండగా ఏడు మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. వారిలో ఇద్దరి పేర్లు ఆన్‌లైన్లో లేవని చెప్పారు.

ఏబీఎం ప్రాథమిక పాఠశాలలో ఆన్‌లైన్లో 94మంది ఉండగా అక్కడ కేవలం నలుగురు మాత్రమే ఉన్నారని అధికారులు తెలిపారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. గతంలో విద్యార్థులు లేని కారణంగా టీచర్లను ప్రభుత్వ పాఠశాలలకు డిప్యుటేషన్‌కు పంపగా కరస్పాండెంట్ రిలీవ్ చేయలేదని ఎంఈవో వెంకటేశ్వర్లు ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో పని చేయకుండానే వారంతా జీతాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, బొర్రా వెంకటరత్నం పాల్గొన్నారు.


మహనీయుల వేషధారణలో చిన్నారులు



కళారూపాల ప్రదర్శన


కార్యక్రమంలో విద్యార్థులు


బెలూన్లు వదులుతున్న ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత, ఎస్పీ దామోదర్

భరతవేదముగ..

గిన్నిస్ బుక్‌లో రికార్డు సాధించే లక్ష్యంతో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అతిపెద్ద భారత జాతీయ పతాకను బుధవారం ఒంగోలులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 4వేల మంది విద్యార్థులు పాల్గొని భారతమాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన పతాక ప్రదర్శన కార్యక్రమం అద్దంకి బస్టాండ్ మీదుగా బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వరకు సాగింది. కళారూపాలు ఆకట్టుకున్నాయి.

చిన్న చదువులకు పెద్ద కష్టం

- ఒకే ఆవరణలో నాలుగు పాఠశాలలు
- వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- కనీసం ప్రాంగణం లేక ఆటలకు దూరం
- వంటగది లేక చెట్ల కిందే భోజనం తయారు

అది ఒక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం. ఒకవైపు భవిష్యత్ కోసం బాటలు వేసుకునే విద్యార్థులు, మరోవైపు బడివైపు తొలి అడుగులు వేసే చిన్నారులు. ఒకేచోట అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాల, ఉన్నత పాఠశాలలు నడుస్తున్నాయి. విద్యార్థులంతా ఒకే పాఠశాల ప్రాంగణంలో ఉండడంతో బోధన అర్థం కాక సతమతమవుతున్నారు. దీంతో పాటు అక్కడ సమస్యలకూ కొదవ లేదు. ఇదీ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తీరు.


జడ్పీ ఉన్నత పాఠశాలలో అర్ధంతరంగా ఆగిన నాడు-నేడు పాఠశాల నిర్మాణాలు

పొదిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉర్దూ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 393 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పాఠశాల సమయం వేళలు, ఉన్నత పాఠశాల వేళలకు పొంతన లేకపోవడంతో ఉన్నత పాఠశాల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్నారుల గోలతో చదువుపై దృష్టిసారించలేకపోతున్నామని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు సరిపడినన్ని తరగతి గదులు లేకపోవడంతో వరండాల్లోనే తరగతులు సాగిస్తున్నారు. ఏ ఉపాధ్యాయుడు ఏం చెప్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. పాఠశాలలో వసతులు కరువయ్యాయి. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు వంటశాల కూడా లేకపోవడంతో చెట్ల కిందే భోజనం తయారు చేస్తున్నారు. కట్టెలపొయ్యిపై వంట చేస్తుండడంతో వచ్చే పొగ ఆవరణ, తరగతిగదుల్లోకి వ్యాపించి విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఉన్న చిన్న ఆవరణలో అందరూ ఒకేసారి భోజనం చేయాల్సి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలను విభజించకపోవడంవల్లే సమస్యలు తలెత్తుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆటస్థలం కూడా లేకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. క్రీడలు లేకపోవడంతో పిల్లలు మానసిక ఉల్లాసం తగ్గుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఉన్నత పాఠశాలను గానీ, మిగిలిన పాఠశాలలనుగానీ వేరే ప్రాంతాలకు తరలించడంతోపాటు వసతుల కల్పనకు కూడా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాడు అర్ధంతరంగా ఆగాయి..

నేడు నిర్మాణాలు సాగాయి

వైసీపీ పాలనలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన నాడు - నేడు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారుస్తామని మాటలు హామీలకే పరిమితమయ్యాయి. చేసిన పనులకు నిధులు విడుదల కాక తరగతిగదుల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమైనా తరగతి గదుల నిర్మాణం పట్టించుకోలేదు. జడ్పీ ఉన్నత పాఠశాలకు మరో ఆరు అదనపు గదులు కావాలని కోరారు. అయితే మూడు అదనపు గదులు కేటాయించారు. ప్రారంభించి మొదటి ఫేజ్ పనులు మాత్రం ఎట్టకేలకు పూర్తి చేశారు. రెండవ ఫేజ్‌లో ప్రారంభించిన నాడు-నేడు పనులు నిధుల గ్రహణంతో మధ్యలోనే నిలిచాయి. పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణాలు స్లాబ్‌కే పరిమితమయ్యాయని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసి తరగతి గదులు పూర్తిచేసి విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం చూస్తున్నాం



జడ్పీ ఉన్నతపాఠశాల ఇరుకుగానే ఉంటుంది. ప్రత్యామ్నయ స్థలం కోసం చూస్తున్నాం. అదనపు తరగతి గదులు కొంతమేర పూర్తి అయ్యాయి. మనబడి మన భవిష్యత్ కింద ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ఆ గదులు కూడా వినియోగంలోకి వస్తాయి. వర్షాకాలం మినహా ఆ గదులను కూడా కొన్ని తరగతులకు వినియోగిస్తున్నాం. పాఠశాలకు సరిపడినంత కొత్త స్థలం లేదు. దాతల సహాయంతో గదులపైనే రూములు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. దాతల సహాయంతో ప్రత్యామ్నయం చూసి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- ఎం.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఈవో


393మంది విద్యార్థులకు ఈచిన్న గ్రౌండ్‌లోనే ఆటలు, వంటలు


ముక్తాపురంలో లబ్ధిదారులను విచారిస్తున్న కేంద్ర అధికారులు

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొమరోలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బృందం సభ్యులు ప్రభాతశర్మ, నందలాల్ గుర్జర్ అన్నారు. మండలంలోని కొమరోలు, ముక్తాపురం గ్రామపంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల పనితీరును, సమస్యలను పరిశీలించారు. అనంతరం వృద్ధుల పింఛన్‌లు, ఉపాధి హామీ పథకం, హౌసింగ్, పంచాయతీరాజ్, వెలుగు శాఖల్లో అమలు అవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించి 100 రోజుల పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సుబ్బారావు, బేస్తవారపేట ఏపీడీ భాస్కర్‌రావు, ఏపీడీ లక్ష్మారెడ్డి, ఎంపీడీవో చేన్నారావు, ఏఈ కృష్ణారెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ హేమంతనాగరాజు

మార్కాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నాగరాజు బుధవారం మార్కాపురం ఏఈఎస్ కార్యాలయం, ఏపీఎస్‌బీసీఎల్ డిపోలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఏఈఎస్, సీఐ, ఎస్సై కార్యాలయాల్లో రికార్డులు తనిఖీ నిర్వహించారు. కేసుల నమోదు, సీజ్ చేసిన వివరాలు పరిశీలించారు. నవోదయం 2.0 కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపోను సందర్శించారు. స్టాక్ రికార్డులు, డిపో నిర్వహణను గమనించారు. బాటిల్ క్యాపుల ధ్వంస కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ఆయనతోపాటు ఒంగోలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కే ఆయేషా బేగం, మార్కాపురం ఏఈఎస్ బాలయ్య, సీఐ వెంకటరెడ్డి, ఎస్సై గోపి, సిబ్బంది ఉన్నారు.

కొండ చిలువ కలకలం

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపాలెం గ్రామంలో బొప్పాయి తోటలో మంగళవారం అర్ధరాత్రి కొండ చిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఆవుల వీరాంజనేయులుకు చెందిన బొప్పాయి తోటలో కొండచిలువ కనిపించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే స్నేక్ రెస్క్యూ టీం మల్లికార్జునకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి చెరుకున్న మల్లికార్జున 9 అడుగుల కొండ చిలువను బంధించారు. అనంతరం దానిని అడవుల్లోకి విడిచిపెట్టారు.

కొండపిలో ఆగిన పొగాకు వేలం

- అడ్డుకున్న కామేపల్లి, పచ్చవ గ్రామాల రైతులు
- మేలురకం బేళ్లను తక్కువ ధరకు కొంటున్నారని ఆవేదన

కొండపి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కొండపి కేంద్రంలో బుధవారం పొగాకు వేలం ఆగుతూ, సాగుతూ వచ్చింది. సాయంత్రం 4 గంటల సమయంలో రైతులు అడ్డుకోవడంతో పూర్తిగా నిలిచిపోయింది. కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు బుధవారం 1,233 బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. గిట్టుబాటు ధర లేదంటూ ఆరంభం నుంచే రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వచ్చారు. దీంతో పలుసార్లు వేలం ఆగి మళ్లీ ప్రారంభమైంది. 817 బేళ్లకు వేలం పూర్తయ్యే సరికి 260 నోబిడ్ అయ్యాయి. దీంతో రైతులు పూర్తిగా కొనుగోళ్లు ఆపాల్సిందేనని పట్టుబట్టడంతో వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ నిలిపివేశారు. మిగిలిపోయిన బేళ్లకు గురువారం వేలం నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

మేలు రకానికి గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు

మేలు రకం పొగాకుకు కూడా వ్యాపారులు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని కామేపల్లి గ్రామానికి చెందిన పొగాకు రైతులు రావూరి కోటేశ్వరరావు, దాచర్ల వెంకటనారాయణ, పత్తిపాటి మాధవ, బెజవాడ రాంబాబు, మల్లెల శ్రీను విలేకరుల ఎదుట వాపోయారు. లోగ్రేడ్ పొగాకులో బ్రైట్ రకం ఉన్నప్పటికీ వ్యాపారులు నోబిడ్ చేస్తున్నారని వారు ఆరోపించారు. బ్రైట్ రకం పొగాకును కొనకపోతే తాము ఎలా బతకాలని వాపోయారు. మొద్దపచ్చలు, నల్లబొగులు మిక్స్‌డ్, సెలైన్ పొగాకును వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.


పొగాకు వేలం కేంద్రంలో నిలిచిన బేళ్లు



విద్యా వనంలో.. రంగుల సంగమం

ఎక్కడో గులాబీ వనంలో పలురకాల పూలు చక్కగా పూశాయని భ్రమిస్తే పప్పులో కాలేసినట్లే. బుధవారం కంభం బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై కంభం ఎస్సై నరసింహారావు అవగాహన కల్పిస్తున్నపుడు విద్యార్థినులు శ్రద్ధగా ఆలకిస్తున్నారు. స్కూల్ యూనిఫామ్‌లో భాగంగా వేసుకున్న రకరకాల జడ రిబ్బన్లు అవి. చూడటానికి గులాబీ పూతోటలా కనిపించింది.

- కంభం, (ఆంధ్రజ్యోతి)

రోడ్డు సమస్య పరిష్కరించరూ..

● ఇబ్బందిపడుతున్న స్థానికులు



కోతకు గురై అధ్వానంగా మారిన రోడ్డు

ఉప్పుగుండూరు పంచాయతీ 14 వార్డు పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో గల 4వ లైను రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి కిందికి వచ్చే నీటి ధాటికి రోడ్డు పూర్తిస్థాయిలో కోతకు గురైంది. దీంతో ఆ మార్గంలో నడవాలంటే అక్కడి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇక చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులకైతే రాకపోకలకు అల్లాడుతున్నారు. రాత్రి వేళల్లో కోతపడిన రోడ్డులో నడుస్తూ అనేక మంది కాలు పట్టుతప్పి కిందపడి గాయపడిన సందర్భాలు ఉన్నాయి. పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- నాగులుప్పలపాడు(ఆంధ్రజ్యోతి)

'హరిహర వీరమల్లు' ఘన విజయం సాధిస్తుంది

● మాజీమంత్రి బాలినేని



అభిమానులతో ర్యాలీగా వస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా ఘన విజయం సాధిస్తుందని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఒంగోలు వచ్చిన ఆయనను స్థానిక లాయర్‌పేటలోని తన స్వగృహంలో జనసేన పార్టీ కార్పొరేటర్లు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్‌కల్యాణ్ నటించిన హరిహరవీరమల్లు మొదటిచిత్రమని, ఇది తప్పక సూపర్ హిట్ అవుతుందన్నారు. కాగా సాయంత్రం బాలినేని, ఆయన అభిమానులు నగరంలో భారీ నిర్వహించారు.

నైట్ షెల్టర్‌లో మౌలిక సౌకర్యాలు : పీడీ



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న పీడీ శ్రీహరి

ఒంగోలు కార్పొరేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నిరాశ్రయుల సౌకర్యార్థం ఒంగోలులోని జీజీహెచ్‌లో మెప్మా, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నైట్ షెల్టర్‌లో మౌలిక వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీహరి తెలిపారు. బుధవారం జీజీహెచ్‌లోని నైట్ షెల్టర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్‌లలో అన్ని వసతులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. తాగునీరు, దుప్పట్లు, మరుగుదొడ్లు, ఎండ తీవ్రత సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని సూచించారు. రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● డీపీవో వెంకటనాయుడు



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీపీవో వెంకటనాయుడు

నాగులుప్పలపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు సూచించారు. గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో చెత్తసేకరణ చేయడం లేదని స్థానికులు పలువురు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బుధవారం మద్దిరాలపాడు గ్రామంలో ఆయన పారిశుధ్య నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామస్థులతో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో ఉన్న చెత్త రిక్షాలు, పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్న తీరును అడిగి తెలుసుకొన్నారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నివాస గృహాల్లోని చెత్తను ఎప్పటికప్పుడు చెత్త సేకరణ రిక్షాలు, వాహనాలలో గానీ అందించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని చెప్పారు.

నర్సింగ్ హోంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ఒంగోలు క్రైం, జూలై23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని బేతున్ నర్సింగ్‌హోంలో అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం సాయంత్రం ఆసుపత్రిలో గల ఆపరేషన్ థియేటర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఎయిర్‌కండిషనర్‌లో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో ఆసుపత్రిలో ఉన్న రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అదే సమయంలో విద్యుత్‌శాఖ అధికారులు వచ్చి పరిశీలించారు. ఎయిర్ కండిషనర్‌లో మంటలు వచ్చి పీవోపీ అంటుకొని దట్టమైన పొగ వచ్చినట్లు గుర్తించారు. అయితే వెంటనే అప్రమత్తం కావడంతో ప్రమాదం ఏమి లేదని అధికారులు వెల్లడించారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు జిల్లా అభివృద్ధి వేదిక, ఓపీడీఆర్, ప్రజాసంఘాలు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని మీడియా కెమెరామన్ అసోసియేషన్ హాలులో వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కొండపి, కందుకూరు మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చుండూరి రంగారావు మాట్లాడుతూ ఈపోటీలు ఈనెల 26వతేదీ వరకు జరుగుతాయని, జిల్లాలోని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యాయనిర్ణేతలుగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దూళిపాళ్ళ వెంకటేశ్వర్లు, గడ్డం మురహరరావు, రిటైర్డ్ ఉప కలెక్టర్ పేరయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు, కేఎన్‌పీఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి మేడికొండ జార్జి, కొండపి మండలం ముప్పవరం ఆంగ్ల ఉపాధ్యాయుడు రవీంద్ర పాల్గొన్నారు.

మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా రాఘవేంద్రరావు

మద్దిపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా మార్నేని రాఘవేంద్రరావు, సభ్యులుగా మార్నేని కృష్ణారావు, సింగరాజు అరుణ, గాలి వెంకటరాంబాబు, గుళ్లాపల్లి శ్రీనివాసరావు, మర్రిపూడి పద్మావతి, డొక్కా రమాదేవి, ఏల్చూరి శేషయ్యలను నియమిస్తూ బుధవారం ఎండోమెంట్ కమిషనర్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ స్వామి వారి దేవస్థాన అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తామని చెప్పారు.



కమిటీ సభ్యులతో ఆలయ అర్చకుడు

ఘనంగా 'హరిహర వీరమల్లు' విడుదల వేడుకలు

● హాజరైన ఎమ్మెల్యే దామచర్ల, లైవ్‌స్టాక్ డవలెప్‌మెంట్ చైర్మన్ రియాజ్

● నగరంలో అభిమానుల భారీ ర్యాలీ



అభిమానుల సమక్షంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హీరో, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్ర విడుదల వేడుకలు బుధవారం రాత్రి ఒంగోలు నగరంలో అత్యంత ఘనంగా జరిగాయి. కూటమి పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు వేలాది మంది అభిమానులు తరలివచ్చారు. స్థానిక అద్దంకి బస్టాండ్ దగ్గర నుంచి రవిప్రియ మాల్ వరకు యువకులు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం రవిప్రియ మాల్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, లైవ్‌స్టాక్ డవలెప్‌మెంట్ చైర్మన్ షేక్ రియాజ్, జనసేన నాయకులు కంది రవిశంకర్, బీజేపీ నాయకులు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ఎంతో దేశభక్తి కలిగిన నాయకుడని, ఆయన నటించిన హరిహర వీరమల్లు చిత్రం అఖండ విజయాన్ని సాధిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు పవన్ కళ్యాణ్ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతాపార్టీ నాయకులు, వీర మహిళలు, తెలుగు మహిళలు, భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతి కూటమితోనే సాధ్యం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, జూలై23(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం చీమకుర్తి పట్టణ శివారు కాలనీలుగా ఉన్న గంగా, హిమగిరికాలనీల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్‌కు కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. ఆయన ఇంటింటికి తిరుగుతూ ఏడాదికాలంలో ప్రభుత్వం అందజేసిన పథకాలను వివరించే కరపత్రాన్ని పంపిణీ చేశారు. కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటూ వాటికి సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, అవనిగడ్డ శేషయ్య, జానీ, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి హరి, సూరంపల్లి హనుమంతరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, కట్టా రమణయ్య, పొట్లూరి వెంకట్రావు, సత్యం సుబ్బారావు, వెంకట్రావు, నర్రా నాగరాజు, మోమిన్, రఫి తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ సెక్రటరీలు ప్రతి ఇంటికీ వెళ్లాల్సిందే !

● కమిషనర్ వెంకటేశ్వరరావు



శానిటరీ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం మెరుగు పరిశీలన, ఇంటింటి చెత్త సేకరణపై ప్రతి సెక్రటరీ ప్రతి ఇంటికీ వెళ్ళి పరిశీలించాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయలో శానిటరీ సెక్రటరీలలో సమీక్ష నిర్వహించిన ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్యంపై ప్రతిరోజు డీఎంఏ వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి నివేదికలు కోరుతున్నాయని చెప్పారు. అంతేగాకుండా ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజలతో నేరుగా మాట్లాడి శానిటేషన్ గురించి అడిగి తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు. సచివాలయ సెక్రటరీల బదిలీలు పూర్తయి, డివిజన్ల కేటాయింపు కూడా జరిగి పదిరోజులు దాటిందని, అందువల్ల అందరూ ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజలతో మాట్లాడి నూతనంగా వచ్చిన శానిటరీ సెక్రటరీగా తెలియపరుచుకోవాలన్నారు. ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ, కాలువల శుభ్రం జరగాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు. అలాగే డివిజన్‌లలో పిచ్చి మొక్కలు కూడా తొలగించాలన్నారు. కార్మికులు బాధ్యతతో పనిచేయించాలని ఆదేశించారు. సమావేశంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్లు, షేక్ బాబ్జి, నూకతోటి పిచ్చయ్య, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో కొత్తగా 9 పోలింగ్ కేంద్రాలు

● ఈఆర్వో వరకుమార్



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్వో వరకుమార్

చీమకుర్తి, జూలై23(ఆంధ్రజ్యోతి) : ఎస్ఎన్ పాడు నియోజకవర్గంలో కొత్తగా 9 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఈఆర్వో వరకుమార్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నూతన నిబంధనలు మేరకు పోలింగ్ కేంద్రాల పెంపు, మార్పులపై బుధవారం పలు రాజకీయపార్టీల ప్రతినిధులతో చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో వరకుమార్ మాట్లాడుతూ 1200 ఓటర్లు దాటితే నూతనంగా పోలింగ్‌కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ చేస్తున్న క్రమంలో చీమకుర్తి మండలంలో 4, సంతనూతలపాడు మండలంలో 5 వెరసి నియోజకవర్గంలో 9 పోలింగ్‌కేంద్రాలు పెరగనున్నాయని చెప్పారు. దేవరపాలెం, పల్లామల్లి, చీమకుర్తి టౌన్, ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో ఉన్న సంతనూతలపాడు మండలంలో పోలింగ్‌కేంద్రాలు పెరగనున్నాయి. అదేవిధంగా 1200 ఓటర్లు చొప్పున సర్దుబాటు చేయనున్నారు. ఆయా అంశాలపై రాజకీయపార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో తహసీల్దార్లు బ్రహ్మయ్య, నారాయణరెడ్డి, నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి : సీఐ



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు ఆదేశించారు. బుధవారం నాగులుప్పలపాడులోని పోలీస్‌స్టేషన్ వద్ద మండల పరిధిలోని ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోలు నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, యూనిఫాం తప్పక ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ఎవరైనా అనుమానితులు ప్రయాణిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం సచివాలయాల మహిళా పోలీసులతో సీఐ మాట్లాడారు. పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు డ్రగ్స్, చట్టాలపై, గుడ్ టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. శక్తి వారియర్ గ్రూపులు, గంజాయి వ్యతిరేక ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రజియాసుల్తానా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేములపాడుకు ఆర్టీసీ బస్సును నడపాలి

● వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి



ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సును రెగ్యులర్‌గా నడపాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. బుధవారం ఒంగోలులోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావును కలిసి ఈమేరకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం బస్సు తిరుగుతున్నా దాని రాకపోకలపై స్పష్టత లేదన్నారు. శివారు గ్రామం అయినందున ఆటోలు కూడా రావడం లేదని, అందువల్ల బస్సు సర్వీసులను నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో ప్రాథమిక వైద్యశాల ఉందని, నాలుగైదు గ్రామాల నుంచి వైద్యం కోసం ప్రజలు కూడా వస్తుంటారన్నారు. రోజువారీ పనులు చేసుకునే కూలీలతో పాటు విద్యార్థులు కూడా గ్రామానికి వస్తుంటారని, సకాలంలో బస్సులు లేనికారణంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు, మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, గ్రామస్థులు బోయళ్ల వెంగళరావు, ఎ.వెంకటరత్నం, ఎల్.నాగేశ్వరరావు, ఎ.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న రత్నప్రసాద్

చీమకుర్తి, జూలై23(ఆంధ్రజ్యోతి) : బాలబాలికల సంరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి బి.రత్నప్రసాద్ కోరారు. బుధవారం బండ్లమూడి హైస్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ లింగవివక్షత, బాల్యవివాహల నివారణ, గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ అధికారి సువర్ణ, సీడీపీవో ఇవాంజిలీన్, ఎస్ఐ కృష్ణయ్య, హెచ్ఎం భాస్కరశాస్త్రి, విశ్వభారతి, శ్యామ్యుల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్లను సర్దుబాటు చేయాలి

ఒంగోలు విద్య, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పిల్లలు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను, మిగులుగా తేలిన టీచర్లను ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 16 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో 48మంది టీచర్లు ఖాళీగా ఉన్నారన్నారు. జీవోనెంబరు 1 ప్రకారం తగినంత మంది విద్యార్థులు లేని కారణంగా 120 మంది టీచర్లు మిగులుగా తేలారు. వీరందరికి కౌన్సెలింగ్ నిర్వహించి శాశ్విత ప్రాతిపదికన పాఠశాల్లో నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇస్తున్న అన్ని రకాల రాయితీలు, సౌలభ్యం, వసతులు ఎయిడెడ్ విద్యార్థులకు కూడా కల్పించాలని, ఎయిడెడ్ పాఠశాలల నిర్వహణకు సమగ్ర శిక్ష నిధులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా 'రాయపాటి'



అజయ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఒంగోలుకు చెందిన రాయపాటి అజయ్‌కుమార్ నియమితులయ్యారు. పార్టీ జిల్లా నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అజయ్‌కుమార్ తెలిపారు.

50 మంది విద్యార్థుల రక్తదానం



మొక్కను నాటుతున్న అధ్యాపకులు

ఒంగోలు విద్య, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్, ఒంగోలు ప్రభుత్వ వైద్యశాల, రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో 50మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల ఆవరణలో అధ్యాపకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ సీవీ.సుబ్బారావు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఆర్.వీరాంజనేయులు, ట్రైనాన్ అండ్ ప్లేస్‌మెంట్ రూప ఆక్కేష్, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్విస్‌లో ఆపరేషన్ సిందూర్‌పై అవగాహన

ఒంగోలు విద్య, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్‌లకు ఆపరేషన్ సిందూర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 34వ ఎన్‌సీసీ బెటాలియన్ ఒంగోలుకు చెందిన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్‌మోహన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు భారత సైన్యం వీరోచిత పోరాటాన్ని వివరించారు. జమ్మూకశ్మీర్‌లోని పరిస్థితులు, పెహల్గాంలో యాత్రికులపై తీవ్రవాదుల దాడులు, ఆ తర్వాత సైన్యం వీరోచితంగా తీవ్రవాదులను ఎలా ముట్టడించిందో తెలియజేశారు. దేశ రక్షణలో ఎన్‌సీసీక్యాడెట్లు తమవంతు పాత్రపోషించాలని క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గాయత్రిలు కోరారు. కార్యక్రమంలో క్విస్ కళాశాల, ఇతర కాలేజీలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ ఫ్లెక్సీలను తొలగించడం దారుణం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కేఎస్.జవహర్ ఫ్లెక్సీలను తొలగించిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 20న పశివేదలలో జరిగిన ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిని శిక్షించాలన్నారు. రాష్ట్ర కమిషన్ చైర్మన్‌కే ఇటువంటి వివక్ష జరగడం సమాజానికి మాయని మచ్చలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో త్యాగరాజు, కె.విజయకుమార్, జయరాజ్, సురేష్, కోటి, వంశీ పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో పంటల సాగు చేయాలి



సర్వేరెడ్డిపాలెంలో మాట్లాడుతున్న సుభాషిణి

ఒంగోలు(రూరల్), జూలై 23(ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ ఖర్చుతో పంటల సాగు చేపట్టి ఎక్కువ లాభాలు పొందాలని జిల్లా సేంద్రీయ వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ డి.సుభాషిణి పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం, చింతాయిగారిపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె హాజరై మాట్లాడారు. పంటలపై పురుగు మందులు విచ్చలవిడిగా వాడొద్దని, పలు రకాల కషాయాలతో కూడా చీడలను నివారించుకోవచ్చని తెలిపారు. సేంద్రీయ ఎరువుతో భూమి సారవంతంగా ఉంటుందని, పచ్చిరొట్ట పంటలు సాగు చేసి 40రోజులు తరువాత దుక్కిలో కలియదున్నాలని సూచించారు. దీనివల్ల రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఏవో కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

ఒంగోలు(రూరల్), జూలై23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులను సోషల్ ఆడిట్ ద్వారా పరిశీలించి పక్కాగా నివేదికలు రూపొందించాలని ఎంపీడీవో రాజశేఖర్‌రావు కోరారు. బుధవారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాలులో జరిగిన సమావేశంలో మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులు పరిశీలించి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. అవకతవకులను గుర్తిస్తే వాటిని నివేదించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో నాగేశ్వరరావు, ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి : ఎంపీపీ

నాగులుప్పలపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలను సమష్టి కృషితో అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ నల మలపు అంజమ్మ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందిస్తుందని, అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ విరుచ్చి మాట్లాడుతూ ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తుందని, అలాగే బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా ఇస్తుందని చెప్పారు. నూతన గృహ నిర్మాణాల కోసం ఇప్పటికి 736 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మండలంలో 9,670 జాబ్‌కార్డులు ఉన్నాయని, గోకులం షెడ్లు 60 మంజూరు కాగా 40, నీటి తొట్లు 14కు 7 పూర్తి చేశామని ఏపీవో రవి తెలిపారు. ఈదుమూడిలోని తాగునీటి ఫిల్లర్ బెడ్ల మరమ్మతులకు నిధులు అందించాలని సర్పంచ్ బోలే లక్ష్మి, ఎంపీటీసీ మున్నంగి రమ్య, కార్యదర్శి రంగారెడ్డి కోరారు. అమ్మనబ్రోలు, చవటపాలెం గ్రామాల్లో రోడ్లు, సైడుకాల్వలు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీలు ముప్పవరపు సుచిత్ర, పోకూరి రాధిక, అందుకూరి సుబ్బులు సమావేశంలో ఎంపీపీకి వినతిపత్రం అందజేశారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు

పొన్నలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరులోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బుధవారం వైద్యాధికారి కృష్ణచైతన్య, నేత్ర వైద్యుడు వెంకటేశ్వర్లు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి త్వరలోనే కళ్లజోళ్లు ఇస్తామని తెలిపారు. వైద్యులు రవికిరణ్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయడమే లక్ష్యం


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి


సంజీవరాయునిపేటలో అభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


మహిళలతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థికంగా ఎంత ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నా ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. జడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో వున్న భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, పలు రకాల పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నారాయణరెడ్డి ముందుగా పంపిణీ చేపట్టి తర్వాత మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని హామీలను నెరవేరుస్తుందన్నారు. ముఖ్యంగా సూపర్‌సిక్స్ పథకాలలో ఇప్పటికే నాలుగు అమలు చేశామన్నారు. త్వరలోనే మిగిలినవి కూడా అమలు జరుగుతాయన్నారు. ప్రతిపక్ష పార్టీ మాత్రం బురద జల్లేందుకే ప్రయత్నిస్తోందన్నారు. ప్రజలు సంతోషంగా ఉండడం వైసీపీ నాయకులకు ఇష్టం లేదన్నారు. వారికి తగిన బుద్ధి చెప్పినా తీరు మారలేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, ఎమ్‌ఈవో రాందాసునాయక్, హైస్కూల్ ఇన్‌చార్జి హెడ్మాస్టర్ సైమన్, ఐఈఆర్‌టీ లక్ష్మీ, దివ్యాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో వరుణుడి కరుణ

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్ : ప్రజా ప్రభుత్వ సుపరిపాలన చూసి వరుణదేవుడు కరుణిస్తున్నాడని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని దొడ్డంపల్లె, ఓబులాపురం, సంజీవరాయునిపేట గ్రామాలలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పర్యటించి ఏడాది కాలంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాలలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు ఆనందంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్యయాదవ్, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, టీడీపీ నాయకులు నంది శ్రీను పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి కోసం సీఎం కృషి

ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం : టీడీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని దివిపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని అన్నారు. ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో దూసుకెళ్తుందని అన్నారు. ఏడాది పాలనలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఫలాలు అందాయని అన్నారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రావణ మాస పూజలు

గిద్దలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 25 నుంచి శ్రావణమాస పూజలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగ సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మల వెంట సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25న రాజరాజేశ్వరి దేవి అలంకారం, ఆగస్టు 1న దుర్గాదేవి అలంకారం, 8న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, వరలక్ష్మీదేవి అలంకారం, 15న వాగ్దేవి అలంకారం, 22న లలితాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. వరలక్ష్మీ వ్రతంలో కూర్చునే మహిళలు పూజా సామాగ్రిని వారే తెచ్చుకోవాలని, అమ్మవారిశాల కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

చిన్న కండ్లేరు మరమ్మతులకు నిధులు కేటాయించాలి

పుల్లలచెరువు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు చిన్న కండ్లేరు చెరువు కట్ట మర్మతులకు నిధులు కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీపీకి వినతిపత్రం అందజేశారు. బుధవారం పుల్లలచెరువు ఎంపీపీ కార్యాలయంలో ఆయన్ని కలిసి సమస్యను వివరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, గురునాథం, కృష్ణ గౌడ్, రైతులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో రాష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు స్పాట్ వ్యాల్యూయేషన్‌లో చెల్లించాల్సిన రెమ్యూనరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అదనపు తరగతుల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలన్నారు. మేలో జరిగిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన జీతభత్యాలు 2 నెలల నుంచి అందక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీవీ రమణ, యూసుఫ్ షరీఫ్, రమేష్ పాల్గొన్నారు.

రాచర్ల : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మండలంలోని ఆరవీటికోట ఎంపీపీ పాఠశాలలో బుధవారం ఆ శాఖ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. పీఆర్సీ ప్రకటించకపోవడం, పెండింగ్ ఇతర బకాయిలు చెల్లించకపోవడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. సమస్యలు పరిష్కరించాలని కోరింది. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మాజీ సభ్యులు యల్లా శ్రీనివాసులు, సభ్యులు ఎస్‌హెచ్ కబీర్, బీ దేవసహాయం, పాండురంగ స్వామి, పాండు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

రాచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవోలు వీ గిరిధర శర్మ, షేక్ మొయినుద్దీన్ అన్నారు. మండలంలోని సత్యవోలు, కాల్వపల్లి, గౌతవరం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను బుధవారం వారు తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, పాఠశాలల వైపు వారి మనసు మళ్లించేందుకు చిరు ప్రయత్నాలు చేయాలని తెలిపారు. నాణ్యమైన విద్య, మంచి భోజనం, అందించి ప్రభుత్వ పాఠశాలలపై వారికి మక్కువ కలిగేలా చూడాలన్నారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు.

సౌండ్ వస్తే సీజ్

రాచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాల సైలెన్సర్లలో పెద్ద పెద్ద శబ్దాలు వస్తే సీజ్ చేస్తామని ఎస్‌ఐ పి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని అనుములపల్లి జంక్షన్‌లో బుధవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. అధిక సౌండ్‌తో తిరుగుతున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని వాటికి ఉన్న సైలెన్సర్లను తొలగించారు. అలాంటి వాహనాలకు జరిమానాతో పాటు కేసులు నమోదు, బైకులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఏడుగురికి రిమాండ్

కొమరోలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కపల్లిలో ఈనెల 13వ తేదీన ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం వారిని గిద్దలూరు కోర్టులో హాజరుప న్యాయాధికారి భరత్‌చంద్ర 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వారికి జైలు

కొమరోలు మండలంలోని మద్యం తాగి వాహనాన్ని నడిపిన ఇద్దరు వ్యక్తులను డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. మద్యంతాగి వాహనం నడిపిన ఇద్దరు రూ.10వేల జరిమానా, ఒకరికి 50రోజులు మరో వ్యక్తికి 30 రోజుల జైలు శిక్షను న్యాయాధికారి విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఖాదర్ బాషా

డెంగ్యూ లక్షణాలు లేవు

రాచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జేపీచెరువు గ్రామంలో డెంగ్యూ లక్షణాలు ఏమీ లేవని, దీనిపై ఆందోళన అవసరం లేదని ఆకవీడు పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ ఖాదర్ బాషా అన్నారు. గ్రామంలో ఓ బాలికకు డెంగ్యూ సోకినట్లు ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై ఆయన స్పందిస్తూ బుధవారం సిబ్బందితో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా యాంటీ లార్వా ఆపరేషన్ డోర్ టు డోర్ ఫీవర్ సర్వే పరీక్షలు నిర్వహించి ఇద్దరికి టైఫాయిడ్ మరో 31మందికి మైనర్ అనారోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారికి అవసరమైన మందులను పంపిణీ చేసి వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. అనంతరం గ్రామంలో తమ సిబ్బందితో ఎబెట్‌ను పిచికారీ చేయించారు. ఫాగింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జి వెంకటేశ్వర్లు, కె విజయ్ కుమార్, షేక్ బాషా, బి శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు ఆశాలు, సర్పంచ్ ఖాశింబి, కార్యదర్శి వీరగరుడు పాల్గొన్నారు.

మొక్కలు నాటి రక్షించాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి రక్షించాలని శ్రీ చైతన్య ప్రిన్సిపాల్ ఆదినారాయణ అన్నారు. పాఠశాలలో స్మార్ట్ లివింగ్ గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గ్లోబల్ వార్మింగ్ కాలుష్యానికి పరిష్కారంగా మొక్కలు నాటాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దాని పరిరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, ఆర్‌ఐ సురేంద్ర, కోఆర్డినేటర్ వీరాంజనేయులు, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

త్యాగమూర్తులను ఆదర్శంగా తీసుకోవాలి


చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం పోరాడి ప్రాణాలర్పించిన త్యాగమూర్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని వాసవీ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య అన్నారు. వాసవీ విద్యానికేతన్‌లో బుధవారం స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్, బాల గంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆజాద్, తిలక్‌కు నివాళి

గిద్దలూరు టౌన్ : చంద్రశేఖర్‌ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలను పట్టణంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆజాద్, తిలక్ చిత్రపటాలకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు భవనాశి వెంకటరామాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్, బాదుల్లా, పుల్లయ్య, కొప్పరపు నాగేశ్వరరావు, నరసింహులు, శ్రీనివాసులు, రమణరెడ్డి, వేమూరి శ్రీనివాసులు, మిరియాల హరి, హరి, యల్లయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు, 12మద్యం సీసాలు స్వాధీనం

పెద్దదోర్నాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో ఎక్సైజ్ శాఖాధికారులు బుధవారం విస్తృత దాడులు నిర్వహించారు. మార్కాపురం సీఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి మద్యంను అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోగా 12 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మద్యం షాపుల యజమానులతో సమావేశం నిర్వహించి నిబంధనలకు అనుగుణంగా సమయపాలన పాటించాలని, లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని స్థానిక ఆల్ఫా స్కూల్‌లో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇటీవలికాలంలో విద్యార్థులు ఎక్కువగా డ్రగ్స్ లాంటి మాధక ద్రవ్యాలకు ఆకర్షితులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిబారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కనుక విద్యార్థులు చదువుపై ఆసక్తి కలిగి ఉన్న స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్‌ఐ వేమన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయిన నేపథ్యంలో విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. యవత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుకోవాలని చెప్పారు. చదువుపై శ్రద్ధతో చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ప్రజలు ఆన్‌లైన్ ఫోన్ ఉపయోగించే వారు కనీస జాగ్రత్తలు పాటించాలన్నారు. అనవసరమైన మెసేజ్‌లకు స్పందించి ఇబ్బందులు పడవద్దన్నారు. ఏపీకే ఫైల్స్ లింక్‌ను ఓపెన్ చేయడం వలన మీ బ్యాంక్ ఖాతాలో నగదు ఖాళీ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

కంభం : విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని అభివృద్ధి చెందాలని కంభం ఎస్‌ఐ నరసింహారావు తెలిపారు. బుధవారం కంభం బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నవయస్సులో మాదకద్రవ్యాలకు అలవాటుపడడం, చదువు పట్ల శ్రద్ధ చూపకపోతే బంగారు జీవితం నష్టపోతుందని తెలిపారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై మహిళా కానిస్టేబుల్ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు చెప్పండి

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో ప్రభుత్వం అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమం అందించిందని, ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, ఈవిషయం గురించి ఇంటింటికీ వెళ్లి తెలియచేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో, ముఖ్యనాయకులతో ఆయన సమావేశమయ్యారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు అవుతున్న తీరు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలు అమలు చేశామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు కానున్నట్లు పేర్కొన్నారు. వీటన్నింటినీ ప్రజలకు తెలియచెప్పాలని కోరారు. సమావేశంలో గిద్దలూరు, కంభం మార్కెట్ కమిటీ చైర్మన్లు బైలడుగు బాలయ్య, పి.భూపాల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దుత్తా బాలీశ్వరయ్య, అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో

రాచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుములవీడు బీసీ బాలుర హాస్టల్‌ను ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఉదయం పూట విద్యార్థులకు ఇస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. వసతులు, భోజన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు లేవని చెప్పడంతో సంతృప్తి చెందారు. గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హాస్టల్ వార్డెన్ మురళికి సూచించారు.

ట్రిపుల్ ఐటీలో దివ్యాంగ విద్యార్థికి సీటు

అభినందించిన ఉపాధ్యాయులు

ఎర్రగొండపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) ఎర్రగొండపాలెం జడ్పీపాఠశాల దివ్యాంగ విద్యార్థి షేక్ షాబీర్ బాషా ట్రిపుల్ ఐటీ నూజివీడు సీటు సాధించాడు. దివ్యాంగ విద్యార్థి షేక్ షాబీర్ బాషా కష్టపడి చదివి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంపై ఎంఈవో పి ఆంజనేయులు, ప్రధానో పాధ్యాయురాలు యు నాగరాణి, ఉపాధ్యాయులు విద్యార్థి షాబీర్ బాషాను అభినందించారు. పాఠశాలలో బుధవారం దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.


అన్నాభిషేకంలో మార్కండేశ్వరుడు

మార్కండేశ్వరుడికి ఆరుద్ర నక్షత్ర పూజ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని అర్చకులు ఆంజనేయ శర్మ, వరుణ్ తేజ శర్మ మార్కండేశ్వర స్వామి, జగదాంబలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం మార్కండేశ్వరునికి అన్నాభిషేకం చేసి వివిధ పుష్పమాలలతో విశేష అలంకరణ నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ


ఘటాభిషేకంలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పార్వతీ త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాస ముగింపు సందర్భంగా అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. బుధవారం ఉదయం ఆలయంలో వేదపండితుల పసుపుకుంకుమ, చీర సారె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నిర్వహించిన ఘటాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, మహిళలు. భక్తులు పాల్గొన్నారు.

పెయిడ్ ఆర్టిస్టులతో నష్టం లేదు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పెయిడ్ ఆర్టిస్టులతో ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. దర్శిలో ఇటీవల పర్యటించిన వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల విద్యా శాఖ మంత్రి లోకేష్‌పై చేసిన విమర్శలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తిప్పికొట్టారు. పెయిడ్ ఆర్టిస్టులు వచ్చి బురద చల్లినంత మాత్రాన ఏమీ సాధించలేరన్నారు. సమర్థవంతంగా పని చేస్తున్న లోకేష్‌పై ఇలాంటి విమర్శలు చేయడాన్ని ప్రజలు హర్షించలేకపోతున్నారని, ప్రజలే బుద్ధి చెపుతారని ఆయన హెచ్చరించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

స్తంభాలను కమ్మేసిన పిచ్చిమొక్కల తీగలు

గాలి వీచినప్పుడు మంటలు



కొండారెడ్డిపల్లిలో విద్యుత్ తీగలకు దట్టంగా చుట్టుకొని ఉన్న పిచ్చిమొక్కలు

పామూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పామూరులో పలు విద్యుత్ స్తంభాలకు పిచ్చిమొక్కల తీగలు అల్లుకొని ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సమీప గృహాలకు చెందిన ప్రజలు భయాందోళ వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వగ్గంపల్లి పంచాయతీ కొండారెడ్డి గ్రామంలో పారా వెంకటేశ్వర్లు ఇంటి సమీపంలో గల విద్యుత్ స్తంభానికి పిచ్చి తీగ దట్టంగా అల్లుకొని ఉంది. పామూరు పట్టణంలోని కనిగిరి రోడ్డు పాత చెరువు తూము వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకొని ప్రమాదకరంగా తయారై ఉన్నాయి. గాలి వీచినప్పుడు తీగలు అటు ఇటు ఊగుతూ నిప్పురవ్వలు చెలరేగుతున్నాయి. రానున్న వర్షాకాలంలో పిచ్చిమొక్కలు ఇంకా ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు అడ్డంకిగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖకు చెందిన అధికారులు స్పందించి ముందస్తుగా ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులతో కలసి ఆహారాన్ని రుచి చూస్తున్న చైర్మన్ గఫార్

విద్యార్థులకు మేలైన పౌష్టికాహారం అందించాలి

● మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మేలైన పౌష్టికాహారం అందించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక బీసీ-2 హాస్టల్‌ను బుధవారం చైర్మన్ ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్‌లోని వసతులను పరిశీలించారు. టాయిలెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. అల్పాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలపై విచారించారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం, కూరలు పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట సచివాలయ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పేదరికంలేని సమాజం కోసమే పీ 4

పామూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజ నిర్మాణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం పీ- 4 కార్యక్రమాన్ని రూపొందించిందని ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య సూచించారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పీ-4 కింద ఎంపికైన లబ్ధిదారుల అర్హతపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కోటపాటి వెంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాపారాయుడు

కనిగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాపారాయుడు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పీజీ కాన్ఫరెన్స్‌హాల్‌లో డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా నూతన కమిటీ ఎంపికల్లో ప్రధాన కార్యదర్శిగా కనిగిరి ప్రాంతానికి చెందిన కేటీసీ పాపారాయుడును ఎన్నుకున్నట్లు తెలిపారు.

లీజు బకాయిలను చెల్లించాలి

సీఎస్‌పురం(పామూరు) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి సంబంధించిన షాపులకు లీజు బకాయిలను దుకాణదారులు ఈ నెల 31తేదీ నాటికి చెల్లించాలని ఈవో నరసింహబాబు తెలిపారు. దేవస్థానంలో కొబ్బరికాయలు, ఫ్యాన్సీ, పార్కింగ్ రుసుం, తలనీలాలు, కొబ్బరిచిప్పలు, శీతలపానీయాలు, పొంగలిషెడ్డు, క్యాంటీన్, పడిబియ్యం తదితరాలకు సంబంధించి 2010 -11 నుంచి 2024-2025 వరకు సుమారుగా రూ. 30లక్షలు వరకు లీజుదారులు బకాయి ఉన్నారని,31వ తేదీ లోపు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురంలోని కెనరా బ్యాంకు ఆర్థికాభివృద్ధికి విద్యాసంస్థలు సహకరించాలని చీఫ్ మేనేజర్ కె. లక్ష్మీనారాయణ, మేనేజర్ కె విజయలక్ష్మీ కోరారు. మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలను బుధవారం బ్యాంకు సిబ్బంది సందర్శించారు. కళాశాల కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బ్యాంకు కల్పిస్తున్న సేవల గురించి వివరించారు.

కాలి నడకన శ్రీశైలంకు మహిళా భక్తులు

ముండ్లమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన 18 మంది మహిళా భక్తులు శ్రీశైలంలోని మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు బుధవారం కాలి నడకన బయలు దేరి వెళ్లారు. శ్రీశైలం కాలి నడకన వెళ్తున్న భక్తులకు గ్రామస్థులు నీటితో వారు పోసి హారతులు ఇచ్చారు. క్షేమంగా వెళ్లి స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందాలని ఆశీర్వదించారు. వేములబండ గ్రామం నుంచి చింతలపూడి, ఉల్లగల్లు, రెడ్డినగర్, పులిపాడు మీదుగా శ్రీశైలం బయలు దేరి వెళ్లారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

తాళ్లూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : తాళ్లూరులో పారిశుధ్య పనులు బుధవారం నుంచి వేగవంతం చేశారు. వర్షాలు కురుస్తుండటంతో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాప్తిచెందకుండా పనులు చేస్తున్నారు.ఎంపీడీవో దారా హనుమంతరావు ఆదేశంతో సర్పంచ్ చార్లెస్‌సర్జన్, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డిలు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీల్లో, గ్రామ వీధులలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

బాలికలు జాగ్రత్తగా మెలగాలి

కురిచేడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): బాల బాలికలు నేటి సమాజంలో జాగ్రత్తగా మెలగాలని కురిచేడు ఎస్ఐ ఎం. శివ సూచించారు. మండలంలోని నమశ్శివాయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 7, 8 9 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్త అవసరం అన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు.హెచ్ఎం మాలకొండయ్య,ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో బ్యాక్ బెంచీల తొలగింపు

సీఎస్‌పురం(పామూరు) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముండ్లపాడు మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయులు బ్యాక్ బెంచీలను ఎత్తివేసి విద్యార్థులకు విద్యాబోధనను బుధవారం కొనసాగించారు. విద్యార్థుల్లో చురుకైన భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ముండ్లపాడు పాఠశాలలో యూ ఆకార తరగతి గదిలో విద్యాబోధన అభినందనీయమని ఎంఈవో కొండారెడ్డి ఉపాధ్యాయులను అభినందించారు.

బిల్లుల కోసం ఏడేళ్లుగా..

నాడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణం

పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

దొనకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో 2017-18 అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అధికారుల ఆదేశాల మేరకు పలువురు కాంట్రాక్టర్లు అంగన్‌వాడీ భవనాలను నిర్మించారు. కానీ నేటికీ పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లింపులు జరగకపోవటంతో ఏడేళ్లుగా ఎదురుచూస్తూ లబోదిబోమంటున్నారు. నాడు భవన నిర్మాణాలను పర్యవేక్షించిన అధికారులు ఎక్కడున్నారో.. భవన నిర్మాణాలకు చెందిన రికార్డులు ఎక్కడున్నాయో అర్థంకాని పరిస్థితని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవటంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో ఒక్కొక్క భవనానికి రూ.7.50 లక్షల చొప్పున ఇండ్లచెరువులో రెండు కేంద్రాలు, రాగమక్కపల్లిలో ఒకటి, భూమనపల్లిలో ఒకటి, అనంతవరంలో ఒకటి, మంగినపూడిలో ఒకటి, దొనకొండ వీవీపురంలో ఒకటి, బాదాపురంలో ఒకటి, వెంకటాపురంలో ఒకటి పక్కా భవనాలను మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు ఒప్పం



2017-18 సంవత్సరంలో భూమనపల్లి గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం

దాలు కుదుర్చుకున్న కాంట్రాక్టర్లు నిర్దేశించిన ఆదేశాల మేరకు భవనాల నిర్మాణాలు పూర్తి చేయగా సగం బిల్లులు మాత్రమే మంజూరు అయ్యాయి. అనంతరం 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ భవనాలకు చెందిన బిల్లుల మంజూరు గురించి ఐదేళ్ల కాలంలో ఏమాత్రం పట్టించుకోలేదు. గ్రామాల్లో వారు నిర్మాణం పూర్తి చేసిన అంగన్‌వాడీ భవనాలకు మాత్రం అట్టహాసంగా ప్రారంభోత్సవాలు చేసి వాటిని వినియోగించుకుంటున్నారు. కానీ కాంట్రాక్టర్లకు నేటికీ పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరు కాకపోవటంతో ఏం చేయాలో అర్థం కాక నిర్వాహకులు సతమతమవుతున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు మంజూరవుతాయని వారు ఎంతో ఆశపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా నేటికీ అంగన్‌వాడీ భవనాల పెండింగ్ బిల్లులు మంజూరు కాకపోవటంతో అయోమయ స్థితిలో మిగిలిపోయారు.

ఎవరిని అడగాలో అర్థం కావటం లేదు



గ్రామంలో తాము నిర్మించిన అంగన్‌వాడీ భవనానికి సంబంధించి అప్పట్లో కేవలం రూ.4లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. మిగిలిన నగదు కోసం ఏడేళ్లుగా ఎవరిని అడగాలో అర్థంకాక ఎదురుచూస్తున్నాం. ఇటీవల జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత పనుల రికార్డులు కలెక్టర్ వద్ద ఉన్నాయని, కలెక్టర్‌తో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

- విప్పర్ల రమణయ్య, గుత్తేదారు, భూమనపల్లి

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

సుపరిపాలనలో తొలి అడుగులో ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, జూలై23 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు.మండలంలోని పెదఅలవలపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలోనే జలజీవన్ మిషన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు.ఈలోగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో హనుమంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్‌లను ఆయన ఆదేశించారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు .ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, జనసేన మండలపార్టీ అధ్యక్షుడు బండారు రాజు, పువ్వాడి నాగరాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పరిమి ఈశ్వరయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పెదఅలవలపాడులో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

పీ4 పై అవగాహన కల్పించాలి

నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీ4 విధానాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని పెదఅలవలపాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన పీ4 అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అలవలపాడు సచివాలయం పరిధిలో 39మందిని పలువురు దత్తత తీసుకున్నారు.

అన్నివర్గాల సంక్షేమం

పామూరు : సమాజంలోని అన్నివర్గాల ప్రజల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య తెలిపారు. పట్టణంలోని బూత్‌నంబర్ 266 లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ హాజీగౌస్, బూత్ ఇన్‌చార్జి సయ్యద్ ఖాదర్‌బాష పాల్గొన్నారు. పట్టణంలోని 272,277 బూత్‌లలో బూత్ కమిటీ ఇన్‌చార్జి షేక్ చిన్న హజరత్, బత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మైటీడీపీ యాప్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేఎఫ్ ఎస్ నెంబర్ బి సత్యం, బంకా యేబు పాల్గొన్నారు.



బొద్దికూరపాడులో జరిగిన అభివృద్ధిని మహిళల నుంచి తెలుసుకుంటున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

లిక్కర్‌స్కామ్‌లో జగన్ అండ్ కో

బొద్దికూరపాడులో టీడీపీ దర్శి ఇన్‌చార్జి లక్ష్మి

తాళ్లూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి) :గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన లిక్కర్ స్కాంలో మాజీ సీఎం జగన్ అండ్‌కో బ్యాచ్ అడ్డంగా దొరికి పోయారని, జగన్ జైలుకు వెళ్లే సమయం దగ్గర పడిందని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సుపరి పాలన-తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బొద్దికూరపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాళ్లూరు మండలంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం శివరాంపురం సమీపాన రూ. 20కోట్లతో నిర్మిస్తున్న 133/32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఏడాదిపాలనలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పి.సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు రమణారెడ్డి, జి.వేణుబాబు, సుబ్బయ్య, ఆర్. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 109 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పంపిణీ చేశారు.రైతులకు మినీకిట్లు, ఎల్ఆర్‌జీ 52 రకం కిట్లను సన్నచిన్న కారు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, రైతులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

దర్శి : ప్రజలందరీ ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం 93 మంది బాధితులకు రూ.69.13 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, తాళ్లూరు ఎంపీపీ తానికొండ శ్రీనివాసరావు, దర్శి, ముండ్లమూరు మండలాల పార్టీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసరావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ప్రభుత్వ ఫలాలు

ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందించటమే లక్ష్యమని దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. దర్శి పట్టణంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



వేములబండలో రైతులతో మాట్లాడుతున్న ఏవో తిరుమలరావు

ముండ్లమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసి అధిక లాభాలు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు అన్నారు. బుధవారం మండలంలోని వేములబండ, వేముల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల రైతులతో కలసి సాగు చేసిన మొక్కజొన్న, కంది, సజ్జ పంటలను పరిశీలించారు. అనంతరం రైతుల సమావేశం అయ్యారు. రైతులు రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి గ్రామాల్లో ప్రకృతి సిద్ధంగా లభించే ఆకుల ద్వారా కషాయం చేసి పైర్లకు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

పొగాకు సాగును తగ్గించాలి

కురిచేడు : రైతులు పొగాకు సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలవైపు మరలాలని మండల వ్యవసాయాధికారి సంపత్ కుమార్ తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలుగా కంది, మినుము, సజ్జ పంటలను సాగు చేయాలని కోరారు. మండలంలోని కురిచేడు, పేరుంబొట్లపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టి రైతులతో మాట్లాడారు. పొగాకు సాగు తగ్గించాలని రైతులతో కలసి కురిచేడులో ర్యాలీ నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంలో భాగంగా రైతులకు 36.6 శాతం రాయితీపై ఎల్ఆర్‌జీ 52 ఫౌండేషన్ కంది విత్తనాలు, పండ్ల తోటలకు 40 శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన , మత్య శాఖ, సహాయకులు వెంకటేశ్వర్లు, సుచరిత, మేరీ, తేజస్వి రైతులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

పామూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు నెలలో ఒంగోలు లో జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభ సందర్భంగా 23తేదీన నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి పిలుపునిచ్చారు. స్థానిక విరాట్‌నగర్‌లోని శాఖ కార్యకర్తలతో కలిసి మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతుల ప్రభాకర్, నాయకులు వెంకటేశ్వర్లు, రమణయ్య, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీవీఎస్ మోపెడ్ చోరీ

ముండ్లమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన షేక్ ఖాశిం సైదా టీవీఎస్ వాహనం బుధవారం చోరీకి గురైంది. ఉదయం వేంపాడులోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఉంచి తాళం వేసి అద్దంకి వెళ్లి పని ముగించుకొని తిరిగి రాగా ఉంచిన దగ్గర వాహనం లేక పోవటంతో ఆందోళన చెందారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని అపహరించుకు పోయి ఉంటారని బాధితుడు లబోదిబో మంటున్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీరాం

ఈవ్‌టీజింగ్ చేస్తే ఉపేక్షించం

● ఎస్ఐ శ్రీరాం హెచ్చరిక

కనిగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా బాలికలు, యువతులను ఈవ్ టీజింగ్ చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్ఐ టీ శ్రీరాం అన్నారు. పట్టణంలోని గార్లపేట రోడ్డులోని ఎంఎస్ఎం కళాశాల, ఎమ్మెస్సార్ కళాశాలలకు చెందిన బాల, బాలికలకు బుధవారం ఈవ్‌టీజింగ్‌ను ఏవిధంగా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాల, బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. అల్లరి మూకలు ఎవరైనా మీపై అసభ్యకరంగా ప్రవర్తించటం, మాట్లాడటం వంటివి చేస్తే మీ వద్ద సెల్‌ఫోన్‌లు ఉంటే వారిని చిత్రీకరించి పోలీసులను సంప్రదించాలన్నారు. అదేవిధంగా బైక్‌లపై రైడింగ్ చేస్తూ యువకులు ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే ఆయా బైక్ నెంబరును రాసుకుని పోలీసులకు సమా చారం అందించాలని సూచించారు. లేదా అందుబాటులో ఉన్న ఉపాధ్యాయుల ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అల్లరి చేసిన యువకులను మాత్రమే పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తామన్నారు. అందువల్ల యువతులు, బాలికలు ఎలాంటి అధైర్యానికి లోను కాకుండా పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆటో

● వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బోయపాటి సుబ్బయ్య


దొనకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఫోర్‌వీలర్ ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి కుడికాలు, కుడి చేయి విరిగాయి. ఈ సంఘటన దొనకొండ-మార్కాపురం ప్రధాన రహదారిలోని కేజీబీవీ పాఠశాల మలుపు వద్ద బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు మండలంలోని ఇండ్లచెరువు గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు బోయపాటి సుబ్బయ్య దొనకొండలో ఆటోమొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇండ్లచెరువు గ్రామం నుంచి తన ద్విచక్ర వాహనంపై దొనకొండకు వస్తున్నాడు. కేజీబీవీ పాఠశాల మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఫోర్‌వీలర్ ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుబ్బయ్య కుడిచేయి, కుడికాలు రెండు విరిగిపోయాయి.సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా ప్రదేశంకు చేరుకొని బాధితుడికి ప్రథమ చికిత్స చేసి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడ నుంచి ప్రైవేట్ వాహనంలో నరసరావుపేటకు తరలించారు.

ఆర్థిక సాయం అందజేత

పామూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పామూరు మానవతా సంస్థద్వారా పలువురు బాధితులకు తమ వంతుగా రూ. 30 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు అధ్యక్షుడు వి. వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న పత్తి అంకయ్యకు రూ. 5వేలు, ప్రమాదం కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న దారా దినేష్‌కు రూ. 5వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న టి. మాలకొండయ్యకు రూ. 5వేలు, పక్షవాతానికి గురై ఇబ్బంది పడుతున్న టి. హనుమంతరావుకు రూ. 5 వేలు, డయాలసిస్ రోగి నీరుకట్టు మహేంద్రకు రూ. 5 వేలు, ఆది లక్ష్మమ్మకు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సంస్థ చైర్మన్ కె. రామిరెడ్డి, కార్యదర్శి టి. వెంకటేశ్వరరావు, కన్వీనర్ టి. రమేష్, ఎం. ముసలయ్య, పి. తిరుపతిరెడ్డి, బీఎస్ రంగారెడ్డి, పి. మాల్యాద్రి, ఏ మాల్యాద్రి, తిరుపతిరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

గురువారం 24 జులై 2025

మట్టి పరీక్షలు 38.72



మట్టి నమూనాల పరీక్షలు

భూమి ఆరోగ్యంపైనే సాగు.. దిగుబడులు ఆధారపడి ఉంటాయి. ఇంతటి ప్రధానమైన మట్టి పరీక్షలపై ప్రభుత్వం పట్టుదలగా ఉంది. రైతులకు ఎంతో మేలు చేకూర్చే ఈ మట్టి పరీక్షలపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. ఖరీఫ్ సాగు మొదలైనా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కేవలం 38.72 శాతం మాత్రమే మట్టి పరీక్షలు జరిగాయంటే వ్యవసాయశాఖ శ్రద్ధ తెలుస్తోంది. భూసారం తేల్చేందుకు పెద్దఎత్తున పరీక్షలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా వాటిని చేరుకోవడంలో వ్యవసాయ శాఖ చతికిలపడింది. మట్టి నమూనాలను లక్ష్యాల మేర సేకరించడంతో సరిపెట్టిన వ్యవసాయశాఖ పరీక్షలపై దృష్టి సారించడం లేదు. అదేమంటే సిబ్బంది.. రసాయనాలు.. పరికరాల కొరత ఉందని అందువల్లే పరీక్షలు ఆశించిన మేర చేయలేకపోతున్నట్లు అధికారులు చెప్తున్నారు. 38.72 శాతం పరీక్షలకు సంబంధించిన పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ ఇప్పటికీ చేయలేదని రైతులు వాపోతున్నారు.



నరసరావుపేటలోని భూసార పరీక్షల ల్యాబ్

మందకొడిగా సాగుతున్న వైనం

- లక్ష్యంపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం
- ఖరీఫ్ సాగు మొదలైనా తేలని భూసారం
- వెంటాడుతున్న సిబ్బంది, రసాయనాల కొరత
- భూఆరోగ్య కార్డుల కోసం రైతుల ఎదురుచూపు

(వేమూరు, ఆంధ్రజ్యోతి)

మూడు నెలలుగా భూసార పరీక్షలు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పట్లో ఆ పరీక్షలు పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమునాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 23,284 నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తి చేశారు. లక్ష్యాలు ఇచ్చిన ప్రభుత్వం

శాతమే

క్షేత్రస్థాయిలో వసతులు కల్పించడాన్ని విస్మరించింది. భూసార పరీక్షలు యజ్ఞంలా చేయాలని నిర్ణయించినా ఆచరణలో వ్యవసాయశాఖ విఫలమైంది. భూమిలో సారం ఎంత ఉందో మట్టి పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ పరీక్షల ఆధారంగా సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అయితే పరీక్షలే పూర్తి కాకపోవడంతో (మిగతా 6లో)

శుభాల.. శ్రావణం



- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- పండుగలకు 'నెల'వు.. మహిళలకు ప్రీతిపాత్రం



శుభకార్యాలకు నెలవైన శ్రావణమాసం ఈనెల 25న ఆరంభం కానుంది. ప్రతి ఇల్లు ఓ ఆలయంగా మారి.. ఉదయం, సాయంత్రం వేళల్లో భగవన్నామస్మరణతో మార్మోగనుంది. మరో వైపు పెళ్లి బాజాలు ఘనంగా మోగనున్నాయి. ఈ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలను అధికారు లు, కమిటీ సభ్యులు ముస్తాబు చేస్తున్నారు. సామూహిక వరలక్ష్మీవ్రతాలు, పవిత్రోత్సవాలు, కృష్ణాష్టమి వేడుకలు, రాఖీ పౌర్ణమి వరుసగా జరుగనున్నాయి. ఆషాఢం వీడి శ్రావణం మొదలు కానుండడంతో వ్యాపారులు, రైతులు కొత్త ఆశలు పెట్టుకున్నారు.

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్లను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం మాదకద్రవ్య నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ పాఠశాలల్లో, కళాశాలల్లో ఈగల్ టీమ్‌లను ఏర్పాటు చేసి మాదకద్రవ్య వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

మామూళ్లతో.. మాయ



- అవలీలగా నకిలీ రిజిస్ట్రేషన్లు
- ఆ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు
- రూ.40 కోట్ల ఆస్తికి రిజిస్ట్రేషన్‌పై నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు

గుంటూరు సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒకరి పేరు నుంచి మరొకరి పేరుపై ఆస్తి మార్చాలంటే కట్టుదిట్టమైన పద్ధతి ఉంది. అయితే ఈ పద్ధతికి స్వస్తి పలుకుతూ మామూళ్లతో రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల పరిధిలోని రూ.40 కోట్ల ఆస్తి రిజిస్ట్రేషనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. భారీగా ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తుంది. కొద్దినెలల క్రితం ఉద్యోగ విరమణ పొందిన నరసరావుపేట జాయింట్ రిజిస్ట్రార్ ముందుగానే అన్నీ మాట్లాడుకుని నకిలీ రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం నల్లపాడు పోలీసుల అదుపులో ఉన్న కీలక నిందితుడు అక్రమ రిజిస్ట్రేషన్ గుట్టు విప్పినట్లు తెలుస్తుంది. నకిలీ దస్తావేజులు చేయడం ఆ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్‌కు వెన్నతో పెట్టిన విద్య అని పలువురు చెప్తున్నారు. ఇతడే గుంటూరులో పనిచేసిన సమయంలో (మిగతా 6లో)

కుడి కాల్వకు సాగునీరు

- సాగర్ జలాశయం నుంచి విడుదల
- నీటి విడుదలతో అన్నదాతల్లో హర్షం
- 500 క్యూసెక్కులను క్రమేణా పెంపుదల
- వరద పోటెత్తుతుండటంతో ముందస్తు విడుదల



(నరసరావుపేట, మాచర్ల రూరల్, ఆంధ్రజ్యోతి)

భారీగా వరద పోటెత్తుతుండటంతో నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో సాగర్ జవహర్ కుడి కాల్వకు జలవనరుల శాఖ బుధవారం సాయంత్రం 6 గంటలకు సాగుకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ఏఈలు భారతి, సుదా, అనిత, రమణ పాల్గొన్నారు. క్రమేపి నీటి విడుదలను 6,000క్యూసెక్కులకు పెంచనున్నారు. గత ఏడేళ్లలో జూలైలో సాగు నీటిని విడుదల చేయడం ఇదే ప్రథమం. నీటి విడుదలతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నీటి వనరుల కింద ఇప్పటికే రైతులు వరి నారుమళ్ల సాగు చేపట్టారు.ఈ వారంలో సాగు ముమ్మరం కానున్నది. నీటి విడుదలతో వరి విత్తనాల కొరత లేకుండా వ్యవసాయశాఖ చర్యలు చేప ట్టాల్సి ఉంది.ఇప్పటివరకు రాయితీ వరివిత్తనం పంపిణీని ప్రారంభించలేదు.

పెరిగిన వరద ప్రవాహం..

సాగర్ జలాశయానికి బుధవారం వరద ప్రవాహం పెరిగింది. 1,21,967 క్యూసెక్కుల వరద వస్తుంది. శ్రీశైలానికి వరద పెరగడంతో సాగర్ జలాశయంలో కూడా నీటి మట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కుడి కాల్వకు నీటిని విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి 3374, కుడి కాల్వకు 500, ఎస్‌ఎల్‌బీసీకి 1800, ఎడమ కాల్వకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ 312.04 టీఎంసీలు కాగా బుధవారం సాయంత్రానికి 264.10 టీఎంసీలకు(573 అడుగులు) చేరింది.



వరద ఉధృతికి.. కొట్టుకుపోయిన

గాలుమార్గం

కొల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో గాజుల్లంక-శ్రీకాకుళం వెళ్లేందుకు తాత్కాలికంగా ఇరు గ్రామాల ప్రజలు వేసిన గాలుమార్గం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. మంగళవారం రాత్రి కృష్ణానదికి వరద ఉధృతి పెరగడంతో మార్గం కింద వేసిన తూముల వద్ద కోతకు గురైంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కృష్ణానదిలో వరద నీరు అంతకు అంతకు పెరగడంతో పలు చోట్ల గాలు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. గత జనవరి నుంచి ఇప్పటి వరకు తాత్కాలిక మార్గం ఇరుజిల్లాల ప్రజలకు ఉపయోగపడింది. వరద ప్రవాహంతో గాలుమార్గం తెగిపోవడంతో కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళం, మచిలీపట్నం తదితర ప్రాంతాలకు పెనుమూడి వారధిపై నుంచి వెళ్లాల్సి ఉంది.

ప్రమాదాల జోరు..

- జాతీయ రహదారి వద్ద రోజుకో ప్రమాదం
- కనిపించని ప్రమాద సూచికలు

హెచ్చరికలు ఏవి సారూ?

బాపట్లరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వెదుళ్ళపల్లి, బాపట్ల ప్రాంతాల మీదగా వెళ్ళే జాతీయ రహదారి నుండి బాపట్ల పట్టణంలోకి వెళ్ళేందుకు ఉన్న రోడ్డును గత రెండు సంవత్సరాలు క్రితం వెడల్పు చేసి డివైడర్‌లను వేశారు. రోడ్డు వెడల్పు చేయటంతో పట్టణంలోకి వాహనాల రాకపోకలు ఎక్కువ య్యాయి. వాహనాలు అధిక వేగంతో రావటంతో అధికంగా రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం రోడ్డుపై ప్రమాద హెచ్చరికబోర్డులు లేకపోవటమే. గతంలో బాపట్ల మండలం వెదుళ్ళపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ సమీపంలోని జాతీయ రహదారి మలుపు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఇసుక డ్రమ్ములు శిధిలావస్థకు చేరి రోడ్డుపక్కనే నిరూపయోగంగా పడిఉన్నాయి. హెచ్చరికబోర్డులు లేకపోవటం వలన ఇటీవల వెదుళ్ళపల్లి సెంటర్ రహదారిపై మలుపు వద్ద కారు వేగంగా ఎదురొస్తున్న ద్విచక్రవాహాన్ని ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం డివైడర్‌ను వేగంగా ఢీకొట్టగా ఓ మహిళ అక్కడికక్కడే మృత్యువాత పడినది. ఇలా చెప్పుకుంటూ పోతే బాపట్ల మండలం వెదుళ్ళపల్లి బాపట్ల ప్రాంతాలలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాలలో పదుల సంఖ్యలో మృత్యువాతపడగా ఎంతోమంది గాయాలపాలయ్యారు. గతంతో ప్రమాదాల నివారణకు హెచ్చరికబోర్డులు ప్రధాన కూడలిలో ఏర్పాటు చేశారు, ఇప్పుడు అవి కనుమరగుఅయిపోయాయి. రోడ్డుప్రమాదాలు రోడ్డుమలుపుల వద్ద హెచ్చరికబోర్డులు లేకపోవటం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున సంబంధిత పోలీసు, రోడ్డు రవాణా ఉన్నతాధికారులు బాపట్ల మండలం వెదుళ్ళపల్లి, బాపట్ల ప్రాంతాల సమీపంలో ఉన్న రహదారులపై ప్రమాదాల నివారణకు హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది.



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని బాపట్ల వైజంక్షన్‌రోడ్డు దృశ్యం



జాండ్రపేట ప్రధాన రహదారిలో వీధి కుక్కలు

వీధికుక్కల వీరంగం

- పాదచారులపై ఎగబడుతోన్న కుక్కలు
- ఇటీవల కుక్కకాటు.. రేబిస్‌తో మహిళ మృతి

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పల్లె పట్టణం అన్న తేడా లేకుండా ఎక్కడంటే అక్కడ వీధి కుక్కల వీరంగంతో చిన్నారుల నుంచి పెద్దలు వరకు భీతిల్లిపోతున్నారు. ఒంటరిగా రోడ్లపైకి రావాలంటే వెనుకంజ వేస్తున్నారు. సందుగొందుల్లో సైతం గుంపులుగుంపులుగా సంచరిస్తోన్న శునకాలు కనిపించిన వారిపై దాడి చేస్తున్నాయి. చీరాల నియోజకవర్గ పరిధిలోని ఈపూరుపాలెం, తోటవానిపాలెం, జాండ్రపేట, రామన్నపేట, పందిళ్లపల్లి, వేటపాలెం ప్రాంతాల్లో, పేరాల, చీరాలలో విద్యార్థులపై నిత్యం దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులపైకి ఎగబడుతున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు చేయాలంటే భయాందోళన చెందుతున్నారు. ఇటీవల స్థానిక లక్ష్మీపురంలో కుక్క కాటుకు గురైన కామేశ్వరమ్మ అనే మహిళ ప్రభుత్వ వైద్యశాలలో చేరి చికిత్స పొందుతూ రెండో రోజే రేబిస్‌తో మృతి చెందింది. ఈపూరుపాలెం ప్రధాన రహదారి, సీతారామపేట, మార్కెట్ సెంటర్, పట్టణంలోని ఏరియా హాస్పిటల్ రోడ్డు, ఈపూరుపాలెం, తోటవారిపాలెం, జాతీయ రహదారిలోని మోడల్ స్కూల్ వద్ద శునకాలు భయంగొల్పుతున్నాయి.

జిల్లాలో నల్ల బర్లీ పొగాకు

సాగు నిషేధం

- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు
- కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల,జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో నల్ల బర్లీ పొగాకు సాగును నిషేధిస్తున్నట్లు, రైతులు ప్రత్యామ్నాయ పంటు సాగు చేయాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖాధికారులు, ప్రైవేట్ బయ్యర్లతో మాట్లాడుతూ ఆదేశాలను ఉల్లంఘించే రైతులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఏడాది కంపెనీల హామీలతో రైతులు అధికంగా నల్ల బర్లీ పొగాకు సాగు చేశారని తెలిపారు. అయితే కొనుగోలు సమయంలో కొన్నికంపెనీలు వెనుకడుగు వేసిన నేపథ్యంలో రైతులను ఆదుకోవటానికి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. గతంలో డిమాండ్‌కు మించి సాగు జరగటం వల్ల మార్కెట్‌లో ధరలు గణనీయంగా పడిపోయాయన్నారు. ఇది రైతుల ఆర్థికపరిస్థితిపై తీవ్రప్రభావం చూపిందని వివరించారు. ఈపరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో బ్లాక్ బర్లి పంటసాగు చేయకూడదని, ఇది పూర్తిగా నిషేధితమని పునరుద్ఘాటించారు. ఈనిబంధనలను ఎవరు ఉల్లంఘించిన వ్యవసాయాధికారులు పంటను ధ్వంసం చేయటంతోపాటు నేరుగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఇప్పటికే పండించిప పొగాకును రైతులు ప్రైవేట్ కంపెనీలకు విక్రయించవచ్చుఅని చెప్పారు. రైతులు ఎటువంటి అపోహలకు లోను కాకుండా ప్రభుత్వంపై నమ్మకంతో ఉండాలని, ప్రతిరైతుకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రస్తుతం రైతు పండించిన చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

రోడ్డెక్కుతోన్న మురుగునీరు

సిమెంట్ రోడ్లు వేశారు.. కాల్వలు మరిచారు మురుగునీటితో ఇబ్బందులు పడుతున్న జనం

మేదరమెట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలో సిమెంట్ రోడ్లు నిర్మించారు. అయితే డ్రెయినేజి కాల్వల నిర్మాణాన్ని మరిచారు. దీంతో ప్రధాన రహదారుల్లో సైతం మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కాల్వలు లేకపోవడంతో ప్రజలు మురుగులోనే నడవాల్సి వస్తోంది. పాత గుంటూరు రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి అయిన మిద్దేల డొంకలో మురుగు కాలువలు లేక మురుగునీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. వర్షం కురిసినప్పుడు వర్షపు నీరు, మురుగు నీరు మొత్తం రోడ్డుపై తటాకాలను మరిపిస్తోంది. ఎప్పుడో తీసిన మట్టి కాల్వలు పూడిపోయాయి. రోడ్డు నిర్మాణ సమయంలో సరైన నిబంధనలు పాటించకపోవడంతో పాటు మురుగు కాల్వలు నిర్మించలేదు. ఎన్నో ఏళ్ల నుంచి మురుగునీటి పారుదల వ్యవస్థ లేక ప్రజలు అల్లాడుతున్నారు. ఇళ్ల ముందు రోడ్డుపై పిల్లలు ఆడుకోవడానికి కూడా లేకుండా మురుగు ప్రవాహం ఉంటోందని గ్రామస్థులు వాపోతున్నారు. మిద్దెల డొంకలో సిమెంట్ రోడ్డు నాణ్యత లేకుండా నిర్మించడంతో నిర్మించిన వెంటనే గోతుల మయంగా మారింది.

నిధుల లభ్యతను బట్టి నిర్మాణం

గ్రామంలో చాలా రోడ్లలో డ్రెయిన్లు నిర్మించాల్సి ఉంది. నిధుల లభ్యతను బట్టి సైడ్ కాల్వలు నిర్మిస్తున్నాం. పతుల కాలనీలో ఉపాధి పథకం కింద 40 లక్షలు మంజూరయ్యాయి. సాధ్యమైనంత త్వరలోనే కాల్వల నిర్మాణం చేపడతాం.

-లక్ష్మీకాంత్, ఈవో



మేదరమెట్లలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు, వర్షపు నీరు

స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పక్కన ఎంఎల్ నారాయణ



మహాసభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వలన ఒరిగిందేమీ లేదు

వైసీపీ హయాంలో పరిపాలనను పూర్తిగా గాలికొదిలేసిన జగన్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అద్దంకిలో ఘనంగా ఆ పార్టీ జిల్లా రెండో మహాసభలు

అద్దంకిటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషువాళ్ల దుర్మార్గాలకు, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడింది రెండు పార్టీలని, అందులో ఒకటి కాంగ్రెస్, రెండోది కమ్యూనిస్టు పార్టీయేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ కె.రామకృష్ణ చెప్పారు. అప్పటినుంచి ప్రజల సమస్యల కోసం, కార్మికుల డిమాండ్ల సాధన కోసం, రైతుల కోసం పోరాడుతున్న పార్టీ సీపీఐ అని తెలిపారు. బుధవారం అద్దంకిలోని బంగ్లారోడ్డులో సీపీఐ బాపట్ల జిల్లా రెండో మహాసభ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అధ్యక్షతన జరిగింది. ముందుగా స్థానిక భూపేష్ భవనం నుంచి బంగ్లా రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల ఫలితంగా పేదలు పేదవాడిగానే ఉంటున్నారన్నారు. భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులు అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. మత ప్రాతిపదికన ప్రజల్లో చీలిక తేవడానికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీలేదని చెప్పారు. నాడు అధికారంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని పూర్తిగా గాలికొదిలేసి కేవలం పోలీస్ రాజ్యాంగాన్ని నడిపాడని విమర్శించారు. 150 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే ఆయన కోటలో కూర్చొని సచివాలయానికి కూడా రాలేదన్నారు. ఆయన ఆఫీసుకు రాడు, మనలాంటి వాళ్లు ఎవ్వరైనా వెళ్లి సమస్యలు చెప్పుకుందామంటే ఇంటికి రానివ్వడని చెప్పారు. ప్రజా సమస్యలపై ధర్నా చేస్తామంటే పొద్దునే పోలీసోళ్లను పంపి హౌస్ అరెస్టులు చేయించిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. జనమంతా అమాయకులని, వాళ్లకేమీ తెలియదని, వారికి ఇంతింత డబ్బులు అకౌంట్‌లో పడవేస్తే మళ్లీ తనకే ఓట్లు వేస్తారని దెబ్బతిన్నాడని చెప్పారు. ప్రజలు మహా తెలివైనోళ్లని, ఎన్నికల వరకు ఏమి మాట్లాడకుండా ఎన్నికలలో 11 సీట్లకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. జగన్ హయాంలో ఒక రోడ్డు వేయలేదు, కాలువ తవ్వలేదు, ఒక ప్రాజెక్టు కట్టలేదు, ఒక ఫ్యాక్టరీ పెట్టకుండా ఏమి చేయకుండా నేను బటన్ నొక్కుతాను, మీరు నాకు బటన్ నొక్కండనే తీరులో వ్యవహరించాడన్నారు. చాలా ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు ఇంతవరకు లబ్ధిదారులకు ఇవ్వలేదని చెప్పారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా అన్ని విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక గీతామందిర్‌లో ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జిల్లాలోని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో ప్రజలకు భరోసా

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత వైసీపీ ప్రభుత్వంలా మాయ మాటలు చెప్పడం లేదని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి ప్రజలకు ఉత్తమ భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మున్సిపాలిటీలో 31వ వార్డు, మండల పరిధిలో ఈపూరుపాలెంలో నిర్వహించారు. ముందుగా వార్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి నుంచి అర్జీలు స్వీకరించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

సీతారామాలయం ధర్మకర్తగా రామసుబ్బారావు

చినగంజాం, జూలై 23(ఆంధ్రజ్యోతి) :చినగంజాం గ్రామానికి చెందిన మోటుమర్రి రామసుబ్బారావు స్థానిక పురాతన సీతారామాలయ దేవస్థాన ధర్మకర్తగా నియమితులయ్యారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా రామసుబ్బారావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామసుబ్బారావు మాట్లాడుతూ తన నియామక పత్రంతోపాటు ఆలయ పునర్ నిర్మాణానికి దేవదాయ శాఖ ద్వారా రెండు కోట్ల రూపాయిల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి అందజేసినట్లు తెలిపారు. ఆ నిధులకు 33శాతం మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద రూ.66,67,000 ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చెల్లిస్తే దేవదాయశాఖ వారు సీజీఎఫ్ ద్వారా రూ.1,33,33,000 మంజూరు చేస్తారని చెప్పారు. ఆలయ పునర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పొద వీరయ్య, కొండ్రగుంట శ్రీహరి, వడ్లమూడి సత్యనారాయణ, గోగినేని మురళీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు వలివేటి వెంకట రామానుజం పాల్గొన్నారు.



రామసుబ్బారావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

25న పర్చూరు మండలంలో మంత్రి పయ్యావుల పర్యటన

పర్చూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 25వ తేదీన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించనున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పర్చూరు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలో పాల్గొంటారు. అనంతరం బొమ్మల సెంటర్ నుంచి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. పర్చూరు నెహ్రూకాలనీలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభి, నాగులపాలెంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మాణం చేసిన డ్రెయిన్‌తోపాటు, సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. 12 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రూ.4 కోట్లతో స్త్రీనిధి బ్యాంక్ లింకేజ్ రుణాలను అందజేస్తారు. దీనికి సంబంధించి బుధవారం నాయకులు కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, మండలపార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, కొల్లా శ్రీనివాసరావు, కొల్లా శివరాంప్రసాద్, పోట్రు శోభన్, షేక్ హుస్సేన్, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, పార్టీ శ్రేణులు

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలుగా బాక్స్ స్ట్రక్చర్‌ను నిర్మించాలి

ఎన్‌హెచ్‌ఏఐ పీడీ అనిల్‌కుమార్ రెడ్డికి తేల్చి చెప్పిన మూడు గ్రామాల రైతులు

అద్దంకి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలుగా బెంగళూరు హైవేలో పాత కొటికలపూడి సమీపంలో బాక్స్ స్ట్రక్చర్‌ను వెడల్పుగా నిర్మించాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్ట్ డైరెక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డికి మూడు గ్రామాల రైతులు తేల్చిచెప్పారు. విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ క్రమంలో అద్దంకి మండలంలోని పాతకొటికలపూడి వద్ద 12 అడుగుల వెడల్పుతో బాక్స్ స్ట్రక్చర్ నిర్మాణం పనులు చేస్తున్న నేపథ్యంలో దానిని 20 అడుగుల వెడల్పు చేయాలని 10 రోజుల క్రితం కొత్త కొటికలపూడి, పార్వతీపురం, వేణుగోపాలపురం రైతులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఎన్‌హెచ్‌ఏఐ పీడీ అనిల్‌కుమార్ రెడ్డి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. 20 అడుగుల కంటే తక్కువ వెడల్పుతో నిర్మాణం చేస్తే వరిగడ్డి ట్రాక్టర్లు, సుబాబుల్ కర్ర ట్రాక్టర్లు రాకపోకలకు సాధ్యం కాదని సర్పంచ్ పూనాటి విక్రమ్, మూడు గ్రామాల రైతులు ఆయనకు వివరించారు. ఉన్నత స్థాయిలో చర్చించి రెండు రోజులలో నిర్ణయం తెలియజేస్తామని పీడీ అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. మరో డొంక వద్ద అదనంగా బాక్స్ స్ట్రక్చర్ నిర్మాణం చేయాలని రైతులు కోరగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఏజీఎం సుబ్బానాయుడు, మేనేజర్ అంకమ్మరావు, స్ట్రక్చర్స్ మేనేజర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పీడీతో మాట్లాడుతున్న సర్పంచ్ పూనాటి విక్రమ్, రైతులు

నాగులచెరువులో చచ్చిన చేపలతో నీరు కలుషితం

ఇంకొల్లు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నాగులచెరువులోని తాగునీరు కలుషితమవుతున్నాయి. ఇటీవల సాగర్ జలాలతో చెరువును పూర్తిస్థాయిలో నింపారు. వారం రోజులుగా చెరువులో ఉన్న చేపలు చనిపోయి తేలియాడుతున్నాయి. దీంతో నీరు దుర్వాసన వస్తోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేపట్టాలని కోరుతున్నారు. పంచాయితీ సెక్రటరీ వెంకటేశ్వర్లు స్పందించి తేలియాడుతున్న చేపలను తొలగించే పనిలో ఉన్నారు. నీటిని ల్యాబ్ టెస్టింగుకు పంపినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిలో గవ్వల సున్నం కలిపి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేడు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి పర్యటన

సంతమాగులూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బాలబాలికలకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొననున్నారు. ఆ తర్వాత మక్కెనవారిపాలెంలో ఉదయం 10.30 గంటలకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారని ఆయన కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

నేడు మారుతీ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

ఇంకొల్లు, జూలై 23, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మారుతీ ఐటీఐ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల 24వ తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నారని పేర్కొన్నారు. 300లకు పైగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. 18-30 ఏళ్ల మధ్య వయస్సు కలిగి పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ విద్యార్హత కలిగిన వారికి జీతం రూ.12,000 నుంచి రూ.20,000 వరకు ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 6302764962, 9988853335 నంబర్లలో సంప్రదించాలని ఐటీఐ కాలేజి ప్రిన్సిపల్ కారుమూడి శ్రీనివాసరావు కోరారు.

అంతర్ పంటల సాగు చేపట్టాలి

బల్లికురవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో అంతర్ పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం మండలంలోని కొప్పెరపాలెం, వేమవరం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పొగాకు పంటను సాగు చేయవద్దు అని, పప్పు ధాన్యాలను సాగు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మౌలాలి పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త నర్రా వెంకట్‌కు సతీవియోగం

పర్చూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నర్రా వెంకట్ సతీమణి లక్ష్మీ సుధ(44) బుధవారం మృతి చెందారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు, గ్రామంలో ఏర్పాటు చేసిన పలు ఆలయ నిర్మాణాలతోపాటు, గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందించి దాతృత్వం చాటుకున్నారు. స్థానిక శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎంతగానో సహకారం అందించారు. మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు.

ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

నర్రా లక్ష్మీసుధ హఠాన్మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిలో నర్రా కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిదని, లక్ష్మీ సుధ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని తెలిపారు.

ఎయిడెడ్ టీచర్లను సర్దుబాటు చేయాలి

ఒంగోలు విద్య, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పిల్లలు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను, మిగులుగా తేలిన టీచర్లను ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 16 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో 48మంది టీచర్లు ఖాళీగా ఉన్నారన్నారు. జీవోనెంబరు 1 ప్రకారం తగినంత మంది విద్యార్థులు లేని కారణంగా 120 మంది టీచర్లు మిగులుగా తేలారు. వీరందరికి కౌన్సెలింగ్ నిర్వహించి శాశ్వత ప్రాతిపదికన పాఠశాల్లో నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇస్తున్న అన్ని రకాల రాయితీలు, సౌలభ్యం, వసతులు ఎయిడెడ్ విద్యార్థులకు కూడా కల్పించాలని, ఎయిడెడ్ పాఠశాలల నిర్వహణకు సమగ్ర శిక్ష నిధులు ఇవ్వాలనిడిమాండ్ చేశారు.

మల్లవరం వేంకటేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డ్ నియామకం

మద్దిపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా మార్నేని రాఘవేంద్రరావు, సభ్యులుగా మార్నేని కృష్ణారావు, సింగరాజు అరుణ, గాలి వెంకటరాంబాబు, గుళ్లాపల్లి శ్రీనివాస రావు, మర్రిపూడి పద్మావతి, డొక్కా రమాదేవి, ఏల్చూరి శేషయ్యలను నియమిస్తూ బుధవారం ఎండోమెంట్ కమిషనర్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

పంట మార్పిడి విధానం పాటించాలి

అవీఇవీ



రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో పంట మార్పిడి విధానం పాటించాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం, రామకూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పచ్చిరొట్ట విత్తన సాగు చేపట్టి పూతదశలో భూమిలో కలియదున్నాలని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. పొగాకు సాగు చేపట్టవద్దని, ప్రత్యామ్నాయ పంటలుగా జొన్న, మొక్కజొన్న, పప్పుధాన్యాలు సాగుచేయాలని కోరారు. వ్యవసాయ సహాయకులు శాతరాజుపల్లి హరి, బీబీ జాన్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలి

ఇంకొల్లు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు ప్రత్యామ్నాయంగా నీటి వసతి ఉన్న పొలాల్లో మొక్కజొన్న, నీటి సౌకర్యం లేని పొలాల్లో జొన్న పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి మీరమ్మ సూచించారు. మండలంలోని ఇడుపులపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. 2025-26లో రబీలో పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. శనగలో వచ్చే ఎండుతెగులుపై రైతులకు అవగాహన కలిగించారు.

మద్యం కల్తీ చేస్తే కఠిన చర్యలు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



లైసెన్స్‌దారులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాలసీని అనుసరించి మాత్రమే మద్యం విక్రయాలు జరపాలని, కల్తీకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో లైసెన్స్‌దారులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఆదేశాల మేరకు ప్రభుత్వానికి లైసెన్స్ రుసుం చెల్లించని దుకాణాలకు ఇప్పటికే నోటీసులు అందించామని చెప్పారు. సకాలంలో చెల్లింపులు జరగని దుకాణాలపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మామూళ్లతో.. మాయ

(5వ పేజీ తరువాయి)

మానస సరోవరాన్ని కూడా పలువురికి రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. కలెక్టర్ జోక్యంతో సదరు దస్తావేజులు రద్దు చేసినట్లు తెలిసింది. పిడుగురాళ్ల, ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో కొన్ని వందల నకిలీ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలులో జరిగిన నకిలీ చలానాల కుంభకోణంలో కూడా ఆయన పాత్ర ఉన్నట్లు చెబుతున్నారు. అన్ని తప్పులు చేసినా కొందరు అధికారులు ఆయనను వెనకేసుకు రావడం వల్ల ఇటువంటి వ్యవహారాలు పదే పదే జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గుంటూరులోని గోరంట్లలో రూ.40 కోట్ల ఆస్థి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఇదే జాయింట్ రిజిస్ట్రార్ భారీగా నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ సీనియర్ అసిస్టెంట్‌తోనే 18 జీపీఏ చేయించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం పల్నాడులో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆ సీనియర్ అసిస్టెంట్‌పై కూడా కేసు నమోదు చేయాలని బాధితులు పోలీసులను కోరినట్లు తెలుస్తుంది. ఇప్పటికే నల్లపాడు పోలీసులు నరసరావుపేటలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జాయింట్ రిజిస్ట్రార్, గుంటూరుకు చెందిన మరో రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేశారు.

నకిలీ మనిషిని తెచ్చినా ఓకే..

వాస్తవానికి రూ.40 కోట్ల ఆస్థికి సంబంధించిన అసలు వ్యక్తి కొత్తపల్లి పద్మజ మృతి చెందారు. ఆమె ఆధార్ కార్డు ఆధారంగానే ఆస్థి బదలాయింపు జరగాలి. రిజిస్ట్రేషన్ సమయంలో అసలు యజమాని వేలిముద్రలు కూడా సరిపోలాలి. మామూళ్ల మత్తులో ఉన్న నరసరావుపేట విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ అన్నిటినీ తేలికగా మార్చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరించి అసలు ఆస్థి పరులను వివాదంలోకి నెట్టారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు కొరిటపాడులో అనుమతి ఇచ్చారని సమాచారం.

డీఐజీ జోక్యంతో..

రూ.40 కోట్ల ఆస్థికి నకిలీ రిజిస్ట్రేషన్‌పై బాధితుడు కొత్తపల్లి శ్రీనివాసరావు అప్పట్లో నరసరావుపేట వెళ్లి అధికారులను సంప్రదించినా పట్టించుకోలేదు. దీంతో బాధితుడు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ గుంటూరు డీఐజీకి ఫిర్యాదు చేయడంతో నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్ హడావిడిగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పట్లో నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు చేశారు.

మట్టి పరీక్షలు.. 38.72 శాతమే

(5వ పేజీ తరువాయి)

సాగు పరిస్థితి తారుమారవుతోంది. పొలంలో పంటలు బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలు మొక్కుబడిగా సాగుతుండటంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు, బాపట్ల కంటే పల్నాడులో పర్వాలేదు..

పల్నాడు జిల్లాలో రోజుకు వంద నుంచి 150 లోపే మట్టి నమూనాల పరీక్షలు చేసే సామర్థ్యం మాత్రమే ల్యాబ్‌కు ఉంది. జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా 23,191 మట్టి నమూనాలను సేకరించారు. 12,005 నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. బాపట్ల, గుంటూరు జిల్లాల కంటే పల్నాడు జిల్లాలోనే పరీక్షల నిర్వహణ మెరుగ్గా ఉంది. బాపట్ల జిల్లాలో లక్ష్యం మేర 22,688 సేకరించి 7785 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 13,862 సేకరించగా 3494 పరీక్షలు పూర్తయ్యాయి. పరీక్షలు ఇలా జరిగితే ఏడాది చివరికి కూడా పూర్తికావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సూక్ష్మపోషకాల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మట్టి పరీక్షలు తేలకపోవడంతో ఆయా సూక్ష్మపోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది. సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా సూక్ష్మపోషకాలను ప్రభుత్వం పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో భూసార పరీక్షలు ఇప్పటికైనా వేగవంతం చేయాల్సి ఉంది.

రుణాలు సక్రమంగా చెల్లించాలి

మేదరమెట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి రుణాలు తీసుకున్నా వారి నుంచి నెలవారీ కంతులు సక్రమంగా చెల్లించాల్సిన బాధ్యత వీవోఏల మీద ఉందని డీజీఎం ధర్మేంద్ర చెప్పారు. బుధవారం కొరిశపాడులోని వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏల సమావేశంలో ధర్మేంద్ర మాట్లాడుతూ రుణాలను తీసుకున్న వారు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సతీష్, ఏపీఎం మణిక్యరావు పాల్గొన్నారు.

మురుగు విలయతాండవం.. దోమలు స్వైరవిహారం...!

ఇళ్లను సైతం చుట్టుముడుతున్న వ్యర్థ జలాలు

దండుబాట రోడ్డు అధ్వానంతో ప్రజలు బెంబేలు

కన్నెత్తి చూడని అధికారులు

రోగాలతో విలవిల్లాడుతున్న ప్రజలు

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపాలిటీ పరిధిలోని 26వ వార్డు.. ప్రకాష్‌నగర్ దండుబాట రోడ్డులో వ్యర్థ జలాలు, మురుగు నిల్వలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. జనావాసాల్లో మురుగు నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయి. పందులు పేట్రేగిపోతున్నాయి. ఈక్రమంలోనే డెంగ్యూ కూడా ప్రబలుతోంది. గతంలో ఇదే ప్రాంతంలో డెంగ్యూ జ్వరం సోకి 13 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. తాజాగా మళ్లీ ఇటీవల కురిసిన వర్షాలు, మురుగు నీరు ఏకమై బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి.



విష సర్పాలకు ఆవాసాలుగా చిల్లచెట్లు, మురుగు నీరు



ఇళ్ల మధ్యలోకి చేరిన మురుగు నీటిలో మహిళల అవస్థలు

ఇళ్ల చుట్టూ మురుగు నీరుతో అవస్థలు



సుధీర్, స్థానికుడు

మా ప్రాంతంలో డెంగ్యూ కారణంగా గతంలో మా బంధువు 13ఏళ్ల బాలుడు మృత్యువాతపడ్డాడు. ఇప్పుడు ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరి చాలా ఇబ్బందులు పడుతున్నాం. దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రి వేళల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇటువైపు రావడం లేదు. మా పరిస్థితి పట్టించుకున్న నాధుడు లేడు

రోగాలు ప్రబలుతున్నాయి



రమేష్, స్థానికుడు

ఇళ్లల్లోకి సైతం మురుగు నీరు చేరింది. మురుగుతో అవస్థలు పడుతున్నాము. ఈ మురుగులో పెరుగుతున్న చిల్ల చెట్లతోపాటు విషసర్పాలు సంచరిస్తున్నాయి. అధికారులు శానిటేషన్, ఆయిల్ బాల్స్ చేయాలి. కొంతకాలంగా ఎక్కువమంది డెంగ్యూ బారిన పడ్డారు. అధికారులు మా సమస్యలను పరిష్కరించాలి.

మంత్రి ఆదేశాలతో తీరిన మంచి నీటి సమస్య

బల్లికురవ ఎస్సీ కాలనీలో

రూ. 3 లక్షలతో మినీ వాటర్ ట్యాంకు ఏర్పాటు

హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

బల్లికురవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి మంచి నీటి సమస్యతో విలవిలలాడుతున్న బల్లికురవ ఎస్సీ కాలనీవాసులకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఇటీవల బల్లికురవ ఎస్సీ కాలనికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి రవికుమార్ వచ్చారు. కాలనీ వాసులు తమకు తాగునీరు అందటం లేదని తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. వెంటనే మంత్రి రక్షిత పథకం ద్వారా వచ్చే పైప్ లైన్ నీటితో మినీ ట్యాంకు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఎంపీడీవో కుసుమకుమారి మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలు మంజురు చేశారు. అదే కాలనీకి చెందిన టీడీపీ నేత కత్తి బుల్లిఅంజయ్య మీని వాటర్ ట్యాంకు పనులను శరవేగంగా పూర్తి చేయించారు. అంబడిపూడి రక్షిత నీటి పథకం ద్వారా వచ్చే మెయిన్ పైప్‌లైన్ నుంచి బల్లికురవ ఎస్సీ కాలనీకి పైప్‌లను ఏర్పాటు చేసి 5 వేల లీటర్ల వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నూతనంగా ఏర్పాటు చేసిన తాగు నీటి మినీ ట్యాంకు

సామాజిక తనిఖీలో వెలుగు చూస్తున్న అక్రమాలు

గత ఏడాది కాలంలో చేపట్టిన

రూ.12 కోట్ల ఉపాధి పనులపై

జరుగుతున్న సామాజిక తనిఖీలు

అక్రమాలకు పాల్పడిన

అధికారులలో ఆందోళన

బల్లికురవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో గత ఏడాది కాలంలో జరిగిన పలు రకాల పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు జరుగుతున్నాయి. మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు చేపట్టిన 645 పనులకు సంబంధించిన రూ.12 కోట్ల నిధుల వినియోగంపై ఎస్ఆర్‌పీ తులసీనాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టాయి. తనిఖీ బృందాలు పని ప్రదేశాలే కాకుండా ఇంటింటికీ తిరిగి కూలీలను సైతం విచారిస్తున్నాయి. ఇప్పటి వరకు కొత్తూరు, గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో తనిఖీలు చేసి గ్రామసభలు పూర్తి కాగా సుమారు రూ.38 లక్షల మేర పనులలో అక్రమాలు ఉన్నట్లు గ్రామసభల ద్వారా తనిఖీ బృందాలు వెల్లడించాయి. అలానే పలు చోట్ల ఒకే ఫొటోలను తీసి కూలీలు పనులకు వచ్చినట్లు నమోదు చేశారు. మిగిలిన గ్రామాలలో కూడా తనిఖీలు పూర్తయితే అక్రమాలు ఇంకా బయట పడతాయని ప్రజలు చెబుతున్నారు. అధికారులు ముందుగా వెళ్లి కూలీలకు ఎలాంటి అవకతవకలు జరగలేదని చెప్పాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.



కూకట్లపల్లిలో పనులలో జరిగిన లోపాలను వివరిస్తున్న తనిఖీ బృందం

నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీలు

సామాజిక తనిఖీల బృందాలు గతంలో జరిగిన తనిఖీల కంటే ఈసారి కఠినంగా వ్యవహరిస్తున్నాయి. అన్ని రకాల వివరాలను సేకరిస్తున్నారు. పనుల వద్ద కొలతలు పూర్తి స్థాయిలో చేపడుతున్నారు. ఎక్కడైన అనుమానాలు ఉంటే వెంటనే పనులు చేసిన ఫొటోలను పరిశీలిస్తున్నారు.

నేడు నాలుగు గ్రామాలలో గ్రామసభలు

ఉపాధి పనుల సామాజిక తనిఖీలు జరిగిన గుంటుపల్లి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం, అంబడిపూడి గ్రామాలలో గురువారం గ్రామసభలు జరగనున్నాయి. ఈ సభలలో కూలీల సమక్షంలో తనిఖీలు చేసిన విధానం, పనులలో జరిగిన లోపాలను తనిఖీ బృందాలు వెల్లడిస్తాయి. వచ్చే నెల 6వ తేదీన మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహించి అన్ని గ్రామాలలో చేపట్టిన తనిఖీల వివరాలను వెల్లడించనున్నారు.

చీరాలలో పాత నేరస్థుడు హల్‌చల్

హైవేలో వాహనాలు నిలిపి కత్తితో బెదిరించి డబ్బులు డిమాండ్

ఓ లారీ డ్రైవర్ అడ్డం తిరగడంతో వ్యవహారం బట్టబయలు

విషయం తెలుసుకుని హుటాహుటిన సంఘటన

స్థలానికి చేరుకున్న ఎస్సై చంద్రశేఖర్

పోలీసులు రంగప్రవేశంతో పరారైన పాత నేరస్థుడు

దగ్గర కొస్తే కత్తితో కోసుకుంటానని గొంతుకు గాయం

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు బాగా ముదిరారు. ఇష్టం వచ్చిన విధంగా నేరాలకు పాల్పడటం, తేడా వస్తే వ్యక్తిగత దాడులు చేసుకుని పరారవుతుండటం పరిపాటిగా మారింది. మండల పరిధిలోని ఈపూరుపాలెం-స్టూవర్టుపురం జాతీయ రహదారిలోని సరిహద్దు వద్ద బుధవారం మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. రామనగర్‌కు చెందిన పాత నేరస్థుడు రెండు మండలాలకు చెందిన సరిహద్దులోని 216 జాతీయ రహదారిలో వాహనాలు అడ్డగించి కత్తి చూపించి బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఈ తంతు జరుగుతుండగా పశువుల లోడుతో వెళుతున్న లారీని ఆపి డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో డ్రైవర్ నిరాకరించాడు. ఈక్రమంలో కొద్దిసేపు వాదోపవాదనలు మధ్య గుట్టు చప్పుడుగా డ్రైవర్ ఈపూరుపాలెం పోలీసులకు సమాచారం చేరవేశాడు. దీంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై చంద్రశేఖర్, సిబ్బందిని చూసి నేరగాడు పక్కన పొలాల్లోకి పరుగులు తీశాడు. పోలీసులు వెంబడించే ప్రయత్నం చేశారు. నేరగాడు అతని వద్ద ఉన్న కత్తితో 'మీరు దగ్గరికి వస్తే నేను కోసుకుంటా'నని బెదిరించసాగాడు. దీంతో పోలీసులు అవాక్కయ్యారు. అయినప్పటికీ ముందుకు వెళ్లే ప్రయత్నంగా చేయగా నేరగాడు కత్తితో గొంతుపై, చేతులపై రెండు చోట్లా కోసుకుని రక్తగాయాలు చేసుకున్నాడు. ఇంకా ముందుకొస్తే చచ్చిపోతానని బెదిరిస్తూ పొలాల్లోకి పారిపోయాడు. దీంతో పోలీసులు వెనుదిరిగారు. వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. మంగళవారం నాడే ఆంధ్రజ్యోతి పాత నేరస్థులతో కొత్త సవాళ్లు శీర్షికలో ఈ తరహా ముదిరినట్లు వివరించిన సంగతి పాఠకులకు విదితమే.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య వివాదం

విషయం తారస్థాయికి చేరి

ఆటో దహనం

పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు

ఇప్పటికే వేటపాలెం పోలీసుల అదుపులో ఒకరు

వేటపాలెం/చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చినగంజాంకు చెందిన ఇరువురు స్నేహితులు మద్యం సేవిస్తూ ఘర్షణ పడ్డారు. దీంతో వీరిలో ఒకరికి చెందిన ఆటోను తగులబెట్టుకుని పరస్పరం అభియోగాలు చేసుకున్నారు. అందిన వివరాల ప్రకారం... చినగంజాంకు చెందిన షమీర్ వేటపాలెంలోని ఓ పంక్చర్ షాపులో పనిచేస్తున్నాడు. అతని మిత్రుడు చినగంజాంకు చెందిన వీర్ల బాబు బుధవారం వేటపాలెం వచ్చాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవిస్తుండగా ఘర్షణ పడ్డారు. దీంతో 216 జాతీయ రహదారిలో ఆటో తగులబెట్టుకుని, నువ్వే చేశావంటే.. నువ్వే చేశావని ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న వేటపాలెం పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇప్పటికే ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేశారు.



కాలిపోతున్న ఆటో

డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కేసులు

బల్లికురవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని బాపట్ల ఆర్టీవో ప్రసన్నకుమారి హెచ్చరించారు. బుధవారం బల్లికురవ మండలంలో ఇటీవల రెండు ప్రమాదాలలో పోలీసు స్టేషన్‌కు తరలించిన రెండు వాహనాలను ఆర్టీవో పరిశీలించారు. అనంతరం వాహనాలను రిలీజ్ ఆర్డర్ ఇచ్చారు. అనంతరం పలు కూడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకుడి మృతి



మృతి చెందిన యాచకుడు

మార్టూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : ఇంద్ర ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... టోల్‌ప్లాజా వద్ద ఒంగోలు వైపు ఆగిన ఆర్టీసీ బస్సు నుంచి ప్రయాణికులు దిగుతున్న సమయంలో డ్రైవరు దగ్గర ఒక యాచకుడు డబ్బులు తీసుకొని, పక్కకు వస్తున్న సమయంలో ఒంగోలువైపు వెళుతున్న ఇంద్ర బస్సు యాచకుని ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన యాచకుడి తలకు దెబ్బతగిలింది. దాంతో సమీపంలోని హైవే అంబులెన్స్‌లో యాచకున్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యలోనే అతను చనిపోయాడు. అతనికి సుమారు 30 ఏళ్ల వయస్సు ఉంటుందని అక్కడి వాసులు తెలిపారు. టోల్ ప్లాజా మేనేజరు కిరణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులు దహన సంస్కార కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్‌ఐ సైదా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సంతమాగులూరు జులై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని పుట్ట సమీపంలో నడుచుకుంటూ వస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బాడీ నుజ్జునుజ్జుకావడంతో మృతుడి వివరాలుతెలియ లేదని పోలీసులు చెప్పారు.

ఇంటిలో చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మార్టూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు పంచాయతీలోని కొణిదెన రోడ్‌లో అమ్మ ఆశ్రమం సమీపంలో మంగళవారం వేకువజామున కొండముది కల్యాణి ఇంటిలో జరిగింది. ఈ చోరీపై బుధవారం ఆమె స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాశీ పుణ్యక్షేత్రం నుంచి తిరిగి వచ్చిన కల్యాణి ఇంటిలోకి రాగానే చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న 12 గ్రాముల బంగారు చైను, రెండు వెండి ఉంగరాలు, వెండి కలశం, ప్యాంట్లు, 2చొక్కాలతో పాటు రూ.10 వేల నగదును దొంగలు ఎత్తుకుపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడులు

రామనగర్(చీరాల), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బుధవారం రామనగర్‌లో పేకాట శిబిరంపై టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈక్రమంలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.4350ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగశ్రీను తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

మార్టూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కోలలపూడి గ్రామంలో బుధవారం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, కలాలు, బిస్కట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మాదాల సాంబశివరావు, తాటి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రవికుమార్ పాల్గొన్నారు.

జనసైనికులు పూజలు

పర్చూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : హరిహర వీరమల్లు సినియా విజయవంతం కావాలని కోరుతూ జనసైనికులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక 92 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈకార్యక్రమంలో శంకరశెట్టి చిరంజీవి, విన్నకోట అజేయ్, సందీప్ తేజ, సాకిరి శ్రీను పాల్గొన్నారు.

అవీఇవీ

25న రామకూరు ఆలయ భూములకు కౌలు వేలం

పంగులూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకూరు గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ భూములకు కౌలు వేలం ఈనెల 25వ తేదీన జరుగుతుందని కార్యనిర్వాహక అధికారి సుబ్బారావు తెలిపారు. సర్వే నెంబరు 136లోని 12 ఎకరాలతోపాటు సర్వే నెంబరు149లో గల 8 ఎకరాల 31 సెంట్ల మెట్టభూమికి రానున్న మూడేళ్ల కాలపరిమితిలోపు కౌలువేలం నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయ భూములకు వేలం జరుగనుందని తెలిపారు. వేలంలో పాల్గొనువారు ముందుగా 5వేల రూపాయల ధరావత్తు చెల్లించాలని వివరించారు.

ఆ పథకం రానివారు గ్రీవెన్స్‌లో పెట్టుకోవాలి

మేదరమెట్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత ఉండి లబ్ధిదారుల జాబితాలో పేర్లు రాని వారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని మండల వ్యవసాయ అధికారి రామ్‌మోహన్‌రెడ్డి చెప్పారు. బుధవారం కోరిశపాడు, బొల్లవరప్పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం పొడిగించారన్నారు. ఈ పథకం కింద పత్తి, వేరుశనగ పంటలకు బీమ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. పత్తి పంట సాగు చేసిన రైతులు పంట ధ్రువీకరణ పత్రం తీసుకుని సీఎస్సీ కేంద్రాల్లో పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఎర్ర మిరప, మినుములు, కంది పంటకు కూడా ఈ నెల 31వ తేదీలోపు, వరి పంటకు ఆగస్టు 15 వరకు పంటల బీమా నమోదు చేసుకోవచ్చన్నారు. తేమ 20శాతంలోపు ఉన్న పొగాకు చెక్కులను కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్.ఐ రమేష్, ఉపాధ్యాయులు

చినగంజాం, జూలై 23(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చినగంజాం ఎస్ఐ శీలం రమేష్ చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యాంటి డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన అవగహన సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. వ్యక్తిగత వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సైబర్ నేరగాళ్లకు చిక్కినట్లేనన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలు గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పవద్దని అన్నారు. ఫోనులలో వచ్చే సందేశాలను పూర్తిగా చదవకుండా అనుమతి కొట్టవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి

మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు



పైపుల మరమ్మతులను పరిశీలిస్తున్న చైర్మన్ సాంబశివరావు

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు పారదర్శకంగా కృషి చేయాలని మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు చెప్పారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఛైర్మన్ నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రజల నుండి వచ్చిన అర్జీల మేరకు 5వ వార్డు, పేరాల రైల్వే గేటు సమీపంలోని తాగునీటి పైపులు లీకేజీ, డ్రెయిన్‌ల మరమ్మతులు చేపట్టారు. ఆ పనులను బుధవారం డీఈ రఘురామ్, ఇంజనీరింగ్ ఏఈ రవికుమార్‌లతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి



మొక్కలను నాటుతున్న ఎంఈవో వస్రాంనాయక్

మార్టూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కావలసిన అన్ని వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, వాటిలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందనిఎంఈవో వస్రాం నాయక్ చెప్పారు. బుధవారం ఆయన మండలంలోని బొబ్బేపల్లిలోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. మొదట ఆయన ముస్లింకాలనీలోని ఉర్దూపాఠశాలను పరిశీలించారు. అనంతరం హెచ్ఈ మోడల్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 21 మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఎంపికచేశామన్నారు. ఈ పాఠశాలల్లో 1 నుండి 5 తరగతులకు, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారని చెప్పారు. అనంతరం స్కూలు ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.


మురుగునీటితో అపరిశుభ్రవాతావరణం



మీ సేవా కేంద్రం భవనం వద్ద నిలబడిన మురుగునీరు

యద్దనపూడి / మార్టూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో మురుగునీరు నిలబడటంతో గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. మూడు నాలుగు రోజులనుంచి వర్షాలు కురుస్తుండడంతో మురుగు నిల్వలు పెరిగి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దానికి తోడు సైడుకాల్వల్లో మురుగు నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పరిశుభ్రత, పచ్చదనంపై ప్రభుత్వం కార్యక్రమాలను చేపట్టాలని చెబుతుండగా, ఇక్కడ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో



అనంతసాగరం జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం నుంచి సోమశిలకు వస్తున్న వరద ప్రవాహం బుధవారం నాటికి పెరిగింది. మంగళవారం 3,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా బుధవారం 5,054 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 27.520 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 4,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కరేడుపై గరం.. గరం

ఎమ్మెల్సీ తూమాటి వ్యాఖ్యలపై మంత్రి ఆనం సహా ఎమ్మెల్యేల అసహనం

ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో చేపడుతున్న భూసేకరణ ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కోరారు. దీంతో కలెక్టర్ 4800 ఎకరాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చామని, ఆ మేరకే ముందుకెళతామని, ఇళ్లు, పొలాలు కోల్పోయే వారికి ఎటువంటి అన్యాయం జరగదని వివరించారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ ఈ విషయంలో రాజకీయాలు చేయవద్దని సూచించారు. గత ప్రభుత్వంలో చేవూరు, రావూరు రైతులకు తక్కువ పరిహారం ఖరారు చేయగా, తాము అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని పెంచామని గుర్తు చేశారు. అయితే ఆ తర్వాత కూడా మరోసారి ఎమ్మెల్సీ మాధవరావు ఇదే విషయంపై మాట్లాడారు. అప్పుడు మంత్రి ఆనం వారించారు. జిల్లా అభివృద్ధిపై సమీక్ష జరుగుతున్నప్పుడు పదే పదే ఒకే విషయంపై మాట్లాడడం మంచిది కాదని హితవుపలికారు. అయినా మాధవరావు వినిపించుకోకపోవడంతో ఎమ్మెల్యే ఇంటూరికి ఎమ్మెల్సీకి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి కూడా సీరియస్ అయ్యారు. ప్రభుత్వ జీవోపై చర్చించాలనుకుంటే అసెంబ్లీకి రావాలని మంత్రులు ఫరూక్, ఆనంలు మాధవ్‌కు సూచించారు. ఆ వెంటనే మాధవరావు డీఆర్సీ నుంచి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతి, డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





జీవోపై చర్చించాలంటే అసెంబ్లీకి రావాలంటూ ఎమ్మెల్సీ తూమాటిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్



కరేడు భూ సేకరణపై ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఎమ్మెల్యే ఇంటూరి మధ్య వాగ్వాదం





డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, ఆనం, పక్కన మరో మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

రైతు ప్రయోజనాలే ముఖ్యం

- సోమశిలకు నీటి విడుదల పెరుగుతుంది
- సర్వేపల్లి రిజర్వాయర్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి
- డీఆర్సీలో ఇన్‌చార్జ్ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్

నెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతు ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ముఖ్యమని, ఆ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి సోమశిల డ్యాంకు నీటి విడుదల పెరుగుతుందని ఆయన తెలిపారు. ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశం బుధవారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ఫరూక్‌తోపాటు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, పీ4 కార్యక్రమం అమలు గురించి కలెక్టర్ ఆనంద్ వివరించారు. అజెండా ప్రకారం 18 ప్రధాన శాఖలపై డీఆర్సీలో సమీక్షించాల్సి ఉన్నప్పటికీ సమయం సరిపోకవడంతో కేవలం వ్యవసాయ, ఇరిగేషన్, హౌసింగ్ శాఖలపై మాత్రమే సమీక్ష జరిగింది. ఈ మూడు శాఖలపై లోతుగా సమీక్షించిన సభ్యులు.. కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడు తూ యూరియా కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వరదలొస్తే సర్వేపల్లి రిజర్వాయర్‌కు ప్రమాదమని ఇరిగేషన్ అధికారులు నివేదించగా, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పేదల ఇళ్ల స్థలాలు, ఇళ్ల విషయంలో ఎమ్మెల్యేల సూచనలు పరిగణలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. పీ4 పథకం ద్వారా మార్గదర్శకులను పేదల ఇళ్ల నిర్మాణంలో భాగస్వామ్యం చేసే ఆలోచన చేయాలని మంత్రి సూచించారు.

- ఇక ఒకేసారి గ్యాస్ సబ్సిడీ నగదు జమ : నారాయణ
- యూరియా కొరత సృష్టిస్తే క్రిమినల్ కేసులు : కలెక్టర్
- మానటరింగ్ చేసి నీరు తెచ్చుకోవాలి : సోమిరెడ్డి
- రాళ్లపాడుకు 1.5 టీఎంసీల నీరు ఇవ్వండి : ఇంటూరి

8

సడలని ఉద్యమం

డీఆర్సీలోకి వెళ్లేందుకు పారిశుధ్య కార్మికుల యత్నం

అడ్డుకున్న పోలీసులు, స్వల్ప ఉద్రిక్తత



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నెల్లూరు(సిటీ), జూలై 23,(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య విభాగాల్లో ప్రైవేట్ కార్మికుల ప్రమేయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, ఇంజనీరింగ్‌లోని పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పక్కనే జడ్పీలో జరుగుతున్న డీఆర్సీ సమావేశంలోకి అనుమతించాలని, అక్కడున్న మంత్రులకు తమ ఆవేదన చెప్పుకునేందుకు వీలు కల్పించాలని ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం జరిగి, తోపులాటకు దారితీసింది. స్వల్ప ఉద్రిక్తత తలెత్తడంతో సీఐటీయూ నేత పెంచల నరసయ్యతోపాటు కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని వేదాయపాళెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం కార్మికులంతా రోడ్డుపైనే నిరసనకు దిగారు. తమ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా లోపలకు వెళ్లేందుకు కొందరికే అవకాశం ఇచ్చిన పోలీసులు, వారిని మంత్రులు నారాయణ, ఆనం వద్దకు తీసుకెళ్లారు. వారికి కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందచేశారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని తెలిపారని కార్మికులు వెల్లడించారు. కాగా పోలీసులు అదుపులోకి తీసుకున్న నాయకులు, కార్మికులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

జడ్పీ కార్యాలయం వద్ద సీఐటీయూ నేతను జీపు ఎక్కిస్తున్న పోలీసులు



'అన్నదాత సుఖీభవ'కు 1,98,514 కుటుంబాలు అర్హత

- ఎన్‌పీసీఐ లింకు లేనివారు 2,520
- బ్యాంకు ఖాతాకు మ్యాపింగ్ కానివారు 4,389
- జాబితాలో పేరులేనివారు ఆర్‌ఎస్‌కేలను సంప్రదించాలి : డీఏవో

నెల్లూరు(వ్యవసాయం), జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికిగాను 1,98,514 కుటుంబాలు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించాయని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) పీ.సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో ఈకేవైసీ పూర్తయి బ్యాంకుకు, ఆధార్‌కు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)కి 2,540 మంది ఇన్‌యాక్టివ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాకు మ్యాపింగ్ కానివారు 4,389 మంది ఉన్నారని ఆమె తెలిపారు. వీరంతా వారి ఆధార్‌ను బ్యాంకులో ఎన్‌పీసీఐకి లింకు చేసుకుంటేనే పథకానికి అర్హులవుతారని తెలిపారు. రైతులు తమ పొలంలోపాటు బ్యాంకు ఖాతాకు ఆధార్‌లింకు అయిఉండాలని, అలాగే ఎన్‌పీసీఐ కూడా మ్యాపింగ్ అయిఉండేటట్లు చూసుకోవాలని వివరించారు. అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను రైతే సేవా కేంద్రా(ఆర్‌ఎస్‌కే)ల్లో అందుబాటులో ఉంచామని ఆమె తెలిపారు. ఇకపోతే ఈకేవైసీ పూర్తయిందా.. లేదా..? అన్న విషయాన్ని నిర్ధారించుకునేందుకు రైతులు మన మిత్ర వాట్సాప్ నంబరు 955230009లో చెక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. చనిపోయినవారి వారసులు ల్యాండ్ మ్యుటేషన్ చేయించుకున్నాక అర్హులవుతాయని తెలిపారు. ఆధార్ రాంగ్ మ్యాపింగ్ అయినవారు తహసీల్దారు కార్యాలయంలో సరిచేసుకోవాలని, సిటిజన్‌షిప్, ఫ్యామిలీ సర్వే సక్రమంగా చేయించుకున్నవారు మాత్రమే పథకానికి అర్హులని తెలిపారు. అనర్హులయినవారు అందుకు గల కారణాలను తెలుసుకుని, సరిచేయించుకుంటే గ్రీవెన్స్ ద్వారా తిరిగి అర్హులవుతారని తెలిపారు. అప్పటి వరకు ఈప్రక్రియ కొనసాగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు ఆర్‌ఎస్‌కేల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.



కౌలు రైతుకు సీసీఆర్‌సీ దక్కేనా..?

- ఈఏడాది 38వేల కార్డుల లక్ష్యం
- అపోహలతో ముందుకు రాని భూ యజమానులు
- పథకాలు దక్కాలంటే ఆ కార్డు తప్పనిసరి

కౌలు రైతులు బ్యాంకు రుణాలు తీసుకోవాలన్నా.. ప్రభుత్వాలు ఇచ్చే పెట్టుబడి సాయం పొందాలన్నా.. రాయితీపై విత్తనాలు, ఎరువులు అందాలన్నా... విపత్తుల సమయంలో పరిహారం దక్కాలన్నా... చివరికి చేతికొచ్చిన పంట అమ్ముకోవాలన్నా... పంట సాగు హక్కు కార్డు(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్ (సీసీఆర్‌సీ)) ఎంతో ముఖ్యం. అయితే ఆ కార్డు దక్కాలంటే భూయజమాని అంగీకారం తప్పనిసరి. కానీ కొందరు యజమానులు అపోహలతో అంగీకారం తెలుపడం లేదు. ఫలితంగా కౌలు రైతులు పథకాలకు దూరమై... ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

- వివరాలు 8లో..



మళ్లీ పెళ్లి సందడి

రేపటి నుంచి శ్రావణ మాసం ● ఆలయాల్లో ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢంతో నెల రోజులుగా వెలవెలబోతున్న కల్యాణ మండపాలు మళ్లీ కళకళలాడనున్నాయి. శుక్రవారం నుంచి శ్రావణ మాసం మొదలవుతోంది. వివాహాలు, గృహ ప్రవేశాలు, నూతన వ్యాపారాలు, ఇతర శుభకార్యాలకు ఈ మాసం శ్రేష్ఠమైంది. ఈ ఏడాది శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఈ నెల 26, 27, 30, 31, ఆగస్టు 1, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 11, 13, 14, 17, 18 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ముహూర్తాల్లో వివాహాల జరిపించడానికి వధూవరుల తల్లిదండ్రులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

● **ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

శ్రావణ మాసం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో ప్రతీ శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు, పల్లకీ సేవలు, మంగళవారాల్లో కాత్యాయనీ వ్రతాలు జరగనున్నాయి. ఇక, ఆగస్టు 8వ తేదీ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సామూహిక పూజలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే, ఆగస్టు 9వ తేదీ శ్రావణ (రాఖీ) పౌర్ణమి, 16వ తేదీ కృష్ణాష్టమి, 23వ తేదీ పోలాల అమావాస్య పండుగలు జరుపుకోనున్నారు.

26న విచారణకు రావాలని మాజీ మంత్రి అనిల్‌కు నోటీసులు

నెల్లూరు (క్రైమ్) : మాజీ మంత్రి, వైసీపీ నేత అనిల్‌కుమార్ యాదవ్‌కు కోవూరు పోలీసులు బుధవారం రాత్రి నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుతో కోవూరు పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు కోవూరు సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అనిల్‌కు కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. నోటీసును అందించేందుకు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ నగరంలోని ఇస్కాన్ సిటీలో ఉన్న అనిల్ కుమార్ ఇంటికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. దీంతో ఆ నోటీసును ఇంటి గోడకు అంటించి వచ్చారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 23 (ఆంధ్ర జ్యోతి) : నిరుద్యోగులకు జిల్లా ఉపాధి కార్యాల యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం విజయ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సంస్థ తరారె గ్లోబల్ సొల్యూషన్స్ నిర్వాహకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటారన్నారు. టెలీ కాలర్స్, ఫార్మసిస్ట్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజ ర్స్, సేల్స్ ఎగ్జి క్యూటివ్స్, స్టోర్స్ మేనేజర్స్ తదితర పోస్టులు భర్తీ చేస్తారని పేర్కొన్నారు. పదవ తర గతి నుంచి ఏదైనా డిగ్రీ, ఫార్మసీ విద్యార్హతలు క లిగిన వారు పాల్గొన వచ్చన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు మేళా ప్రారంభమవుతుం దని, 18 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సైన్స్ అధికారి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 23 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని చెముడుగుంటలో ఉన్న సైన్స్ ప్రదర్శనశాలలో సైన్స్ అధికారిగా డిప్యుటేషన్ పై పనిచేసేందుకు అర్హులైన సైన్స్ ఉపాధ్యా యులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ మేనేజ్ మెంట్‌లో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ సర్‌ప్లస్‌గా ఉన్న క్లస్టర్ ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 26లోగా తమ దరఖాస్తును డీఈవో కార్యాల యంలో అందచేయాలని తెలిపారు.

'వీవో' తళుకులు.. పూజిత మెరుపులు

'హరిహర వీరమల్లు' సినిమా ఫేమ్ పూజిత పొన్నాడ నెల్లూరులో బుధవారం మెరిసింది. నగరంలోని బిన్నీ మొబైల్స్ సంస్థలో వివో కొత్త ఫోన్లను ఆవిష్కరించిన ఆమె కాసేపు అభిమానులతో ముచ్చటించారు.

8 లో..

తాగునీటి ప్రాజెక్టులకు రూ.120 కోట్ల మంజూరు

డిసెంబరు కల్లా సంగం నుంచి నగరంలో ప్రతి ఇంటికి మంచినీరు

నెల్లూరులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

8

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 505

ఉపాధి పనులపై సభ్యుల ఏకరువు

బిట్రగుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సుజాత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇప్పటివరకు చేపట్టిన పనులు, చేయాల్సి ఉన్నవాటిపై అధికారులు నివేదిక సమర్పించారు. రీసర్వే తరువాత రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, విద్యుత్ సమస్యలు, ఉపాధి పనులపై సభ్యులు ఏకరువు పెట్టారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, విద్యుత్ ఏఈ జడరాయ్, ఎంఈవో శైలజ, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ జడ రాయ్

న్యూస్ బాక్స్

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 20 సవర్ల బంగారం అపహరణ

కావలి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరులో పల్లపు మాల్యాద్రి ఇంట్లో చోరీ జరిగిన విషయం బుధవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. మాల్యాద్రి భార్యకు ఆరోగ్యం సరిలేక పోవడంతో చికిత్స నిమిత్తం ఈనెల 18వ తేదీన ఇంటికి తాళం వేసి నెల్లూరుకు వెళ్లి అక్కడే ఉన్నారు. ప్రతి రోజు ఇంటి వద్ద చెట్లకు నీళ్లు పోసి పోతున్న పనిమనిషి బుధవారం వచ్చి చూసేసరికి ఇంటి తలుపుల తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి మల్యాద్రికి సమాచారం ఇచ్చింది. ఆయన వచ్చి ఇంట్లో పరిశీలించగా గుర్తు తెలియని దుండగులు బీరువా పగలగొట్టి అందులోని సుమారు 20 సవర్ల బంగారు ఆభరణాలు దొంగిలించుకు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ సీఐ జీ.రాజేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెల్లూరు క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు స్వీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై రాయితో దాడి

కావలిరూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం విందూరివారి వీధికి చెందిన సన్నిబోయిన కొండలరావు తన ఇంటి వద్ద ప్రహరీ గోడ నిర్మాణానికి సన్నాహాలు చేస్తుండగా పక్క ఖాళీ స్థలానికి చెందిన మొచ్చు శ్రీనివాసులు బుధవారం రాయితో దాడి చేశాడు. దీంతో కొండలరావుకు గాయాలై ఓ పన్ను ఊడిపోయింది. బాధితుడి వివరాల మేరకు.. కొండలరావు ఇంటి పక్కన శ్రీనివాసులు ఖాళీ స్థలం ఉంది. కొండలరావు ఇంటి స్థలంలో నా స్థలం కలిసి ఉందంటూ శ్రీనివాసులు తరచూ వివాదాలకు దిగేవాడు. ఈ క్రమంలో సుమారు 6 నెలల క్రితం కొండలరావు ప్రహరీ గోడకు ఆనుకుని శ్రీనివాసులు ఉద్దేశ పూర్వకంగా గుంట తవ్వించడంతో కొండలరావు ఇంటి ప్రహరీ కూలింది. అప్పట్లో ఇరువురి మధ్య వివాదం జరిగింది. అనంతరం కొండలరావు ప్రహరీ నిర్మాణానికి సన్నాహాలు చేసుకుంటుండగా ఈ దాడి జరిగింది. క్షతగాత్రుడు కొండలరావు చికిత్స నిమిత్తం ఆయన స్నేహితుడు మంచాల ప్రసాద్ ఏరియా వైద్యశాలకు తరలించాడు. బాధితుడి ఫిర్యాదుతో 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి పొంగళ్లలో ఇరువర్గాల వాగ్వివాదం

లింగసముద్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నెబోయినపల్లిలో గ్రామ దేవత గంగమ్మకు పొంగళ్లు జరుపుకొనే విషయమై ఇరువర్గాల మధ్య బుధవారం రాత్రి తీవ్ర వాగ్వివాదం జరిగింది. గ్రామంలోని యాదవ సామాజిక వర్గం వారు ఎస్సీ కాలనీ సమీపంలోని గంగమ్మ గ్రామ దేవతకు పొంగళ్లు జరుపుకొనేందుకు ఊరేగింపుగా వస్తుండగా ఎస్సీ కాలనీకి చెందిన కొందరు అడ్డుకొన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాదన జరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే విషయం తెలుసుకున్న గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్ఐ నారాయణలు పోలీసు బందోబస్తుతో వెళ్లి ఇరువర్గాలతో చర్చించి పొంగళ్లు ప్రశాంతంగా నిర్వహింపజేశారు.

రేపు సీపీఐ నియోజకవర్గ మహాసభ

కందుకూరు/వలేటివారిపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న నిర్వహించనున్న సీపీఐ కందుకూరు నియోజకవర్గ 4వ మహాసభను జయప్రదం చేయాలని ఆపార్టీ కార్యదర్శి బి.సురేష్‌బాబు కోరారు. కందుకూరులోని పామూరు బస్టాండ్ సెంటర్‌లోని లక్ష్మీశ్రీనివాస కల్యాణ మండపంలో మహాసభ జరుగుతుందని, ఉదయం 10 గంటలకు ఓవీ రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆగస్టు 3,4 తేదీలల్లో నెల్లూరు నగరంలో జిల్లా మహాసభలు జరుగుతాయని, ఆగస్టు 20 నుంచి 25వరకు ఒంగోలు నగరంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. మండల కేంద్రమైన వలేటివారి పాలెంలో మహసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి బాలకోటయ్య, నాయకులు ఆనంద్ మోహన్, బాలబ్రహ్మాచారి, మురళి, అంజయ్య పాల్గొన్నారు.

విద్యకు దూరం కాకూడదు

బిట్రగుంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యకు దూరం కాకుండా అని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేర్పాలని కావలి ఉప విద్యాశాఖాధికారి ఎం.హరిప్రసాద్ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథ రావుపేట పంచాయతీ రామస్వామిపాలెం గిరిజన కాలనీలో ప్రధానోపాధ్యాయుడు గంగాధరరావు, పీడీ నరసింహమూర్తి నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన బుధవారం సందర్శించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్ కోసం సహాయ సహకారాలు అందిస్తున్న బాలికల పాఠశాల హెచ్‌ఎం బీ.నీరజ, డాక్టర్ చంద్ర, టీడీపీ నేతలు నాగేశ్వరరావు, సుధీర్‌బాబు, సర్పంచు మంజులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఉపవిద్యాశాఖాధికారి పీ.నరసింహారావు, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ బకాయిలు రూ.3.24 కోట్లు

● 8 వారాల నుంచి అందని నగదు ● అవస్థలు పడుతున్న శ్రామికులు


ముత్యాలపాడులో ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికులు(ఫైల్)

లింగసముద్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న శ్రామికులకు 8 వారాల నుంచి కూలి డబ్బులు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ 4500 మంది చొప్పున 1 లక్షా 44 వేల పని దినాలకు రూ.3.24 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత ఏప్రిల్ నుంచి ఇతర ఏ పనులు లేకపోవడంతో ఉపాధి హామీ పనులే దిక్కవడంతో ఎక్కువ మంది ఈ పనులకు హాజరవుతున్నారు. సుమారు 2 నెలలుగా కూలి డబ్బులు రాకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఉపాధి హామీ పథకం ఏపీవో షేక్ సమీర్‌బాషాను వివరణ కోరగా 8 వారాలకు సంబంధించి 1 లక్షా 44 వేల పని దినాలకు రూ.3.24 కోట్లు రావాల్సి ఉన్న మాట వాస్తవమేనన్నారు. కూలి డబ్బులు వచ్చిన వెంటనే శ్రామికుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. ప్రస్తుతం మండలంలో ముత్యాలపాడు, మొగిలిచెర్ల, మేదరమిట్లపాలెం, చినపవని గ్రామాలలో పనులు జరుగుతున్నాయని, ఈ పనులకు రోజుకు 500 మంది శ్రామికులు హాజరవుతున్నారని చెప్పారు.

గ్రామదేవత అంకమ్మకు ఆషాఢం సారె


అంకమ్మకు ఆషాఢం సారె తీసుకొస్తున్న మహిళలు

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మకు బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. పట్టణంలోని పెద్దబజారులోని కోదండరామాలయం నుంచి మహిళలు పెద్దసంఖ్యలో సారెతో బయలుదేరి బ్యాంకుబజారు, పోస్టాఫీసుసెంటర్ మీదుగా అంకమ్మ ఆలయానికి చేరుకుని పొంగళ్లు, పసుపుకుంకుమ, ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా మహిళాభక్తులు లలితా సహస్రనామ పారాయణం చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన తటవర్తి జానీ, ఇస్కాల శోభారాణి, మాధురిలకు సమరసతసేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టరు తన్నీరు మల్లికార్జునరావు, చక్కా వెంకటకేశవరావు, అనిల్, సత్యవతి, మంచిరాజు మురళి, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కోట వెంకటనరసింహం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ షూస్ బహూకరణ


స్పోర్ట్స్ షూస్ అందుకున్న విద్యార్థులతో బెస్ట్‌వాకర్స్, కేకేసీ సభ్యులు

కావలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కావలి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ నెట్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులకు కావలి బెస్ట్‌వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు బుధవారం స్పోర్ట్స్ షూస్‌ను అందచేశారు. క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత సబ్‌ఇన్‌స్పెక్టర్ శేషయ్య, కేకేసీ సభ్యుడు రాంబాబు, కావలి క్రికెట్‌క్లబ్ అధ్యక్షుడు సిద్దూ, పలువురు క్లబ్ బాధ్యులు, బెస్ట్‌వాకర్స్ అసోసియేన్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సుడిగాలి పర్యటన



రామ్మూర్తిపేటలో రోడ్డు పక్కన వేసిన బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌పై స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

కావలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. రామమూర్తిపేటలో రోడ్ల వెంబడి, ప్రభుత్వ ఖాళీస్థలాల్లో వేసి ఉన్న బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను పరిశీలించి స్థానికులతో ఆ మెటీరియల్ ఎవరు వేశారని ఆరా తీశారు. మెటీరియల్ వేసిన వారిని పిలిపించి వెంటనే దానిని తొలగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మొర్లవారిపాలెంలో ఉన్న డంపింగ్‌యార్డులో ఏర్పాటు చేసి త్వరలో ప్రారంభం కానున్న బయోమైనింగ్ యూనిట్‌ను పరిశీలించారు. అలాగే పలు ప్రాంతాలను పరిశీలించారు.

ఘనంగా ట్రేడ్ యూనియన్ వార్షికోత్సవం

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ ట్రేడ్‌యూనియన్ 70వ వార్షికోత్సవాన్ని స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. పోస్టల్ ఉద్యోగులతో పాటు ఎల్ఐసీ, రైల్వే ఉద్యోగులు పాల్గొని బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గడచిన 70 ఏళ్లలో బీఎంఎస్ చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీపీఈఏ నాయకులు ఎం.సతీష్, బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ జొన్నాదుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘సుపరిపాలనలో తొలి అడుగు’

వలేటివారిపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఈ ఏడాది ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకుమాను ఆంజనేయులు, వీరమోసు అంజయ్య, సందాడి నాగేశ్వరరావు, బూదాల మనోజ్, దుద్దూరి అంజయ్య వలేటి వెంగళరావు, పోతురాజు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఖనిజ నిక్షేపాలను ధారాదత్తం చేస్తే ఒప్పుకోం


లింగసముద్రం : యర్రారెడ్డిపాలెంలో యంత్రాలతో తీస్తున్న ఐరన్ ముక్కలను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

లింగసముద్రం/వలేటివారిపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం, వలేటివారిపాలెం మండల్లాలోని పలు గ్రామాల్లో బయటపడిన ఖనిజ నిక్షేపాలను జిందాల్ కంపెనీకి ధారాదత్తం చేయడాన్ని ఒప్పుకోబోమని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ప్రతినిధి బృందం లింగసముద్రం మండలంలోని యర్రారెడ్డి పాలెం, వలేటివారిపాలెం మండలంలోని అయ్యవారిపల్లి ప్రాంతంలో ఖనిజ నిక్షపాలు ఉన్న ప్రాంతాలను పరిశీలించింది. ఈ సందర్భంగా వారు యర్రారెడ్డిపాలెంలో మిషనరీ ద్వారా తీస్తున్న ఐరన్ ముక్కలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మా ప్రాంతంలో వెలికితీస్తున్న ఖనిజ సంపద తమ ప్రాంత వాసులకే చెందాలన్నారు. లేదంటే వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. అలాగే లింగసముద్రం మండలంలోని యర్రారెడ్డిపాలెం, జంగంరెడ్డి కండ్రిక, ఆర్‌ఆర్ పాలెం, వలేటివారిపాలెంలోని అయ్యవారిపల్లి తదితర గ్రామాలలో ప్రభుత్వ భూములు, కొండలు, పట్టా భూములు, సుమారు 790 ఎకరాలు జియోగ్రాఫికల్ సర్వే అధికారుల ద్వారా సర్వే చేయించి ఐరన్ నిక్షేపాలున్నట్టు నిర్ధారించారన్నారు. ఈ సంపద అంతా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు గుట్టుచప్పుడు కాకుండా జిందాల్ కంపెనీకి కట్టబెట్టడం సరైంది కాదన్నారు. ప్రభుత్వమే ఖనిజ సంపదను వెలికితీసి ఈ ప్రాంతంలో ఉక్కు ఖర్మాగారాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. తద్వారా ఈ ప్రాంత యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిందాల్ కంపెనీకి, ఓఎన్‌జీసీ కంపెనీకి ఎన్‌ఓసీలు ఇవ్వడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టే వెంకటయ్య, దువ్వూరి జాన్, వెంకయ్య, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

● కావలి డీఎస్పీ శ్రీధర్

కావలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వినియోగంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు సెల్‌ఫోన్ వినియోగించేటప్పుడు అప్రమత్తగా ఉండాలని కావలి డీఎస్పీ పీ.శ్రీధర్ తెలిపారు. ఎయిర్‌టెల్‌లో ఫేక్ కాల్ లింక్ తెరుచుకోకుండా ఉండే విధంగా తీసుకువచ్చిన ఏఐ టెక్నాలజీపై ఆ సంస్థ బాధ్యులు బుధవారం తహసీల్దారు కార్యాలయం ఎదురుగా వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగం వచ్చిన తర్వాత ప్రజలు అత్యాశకు పోయి ఇళ్లలో కూర్చుని ఏదో సంపాదించాలని ఆశపడుతున్నారన్నారు. కష్టం లేకుండా డబ్బులు సంపాదించాలని అత్యాశకు పోయిన వారంతా మోసపోయి నష్టపోతున్నారన్నారు. దీనివలన సమాజంలో జనరల్ క్రైం తగ్గుతున్నా సైబర్‌క్రైం మాత్రం పెరుగుతోందన్నారు. మహిళలు సైతం ఇళ్లలో పురుషులకు తెలియకుండా సెల్‌ఫోన్‌ల ద్వారా స్కీంలో డబ్బులు కట్టి సైబర్ క్రైమ్‌లలో ఇరుక్కుని మోసపోతున్నారని చెప్పారు. ఎవరూ ఎలాంటి లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ఎక్కువగా సైబర్ క్రైంలకు పాల్పడే వారంతా హిందీలో మాట్లాతారని అలాంటి వారితో వచ్చీరాని హిందీ మాట్లాడే ప్రయత్నం చేయకుండా స్పష్టమైన తెలుగులో గట్టిగా మాట్లాడితే వాడే భయపడి పెట్టేస్తారన్నారు. కావలికి చెందిన డాక్టర్ల దంపతులు షేర్స్ యాప్‌లోకి వెళ్లి డబ్బులు కట్టి సుమారు రూ.2కోట్లపైన మోసపోయారన్నారు. అలాగే మరో వ్యాపారస్థుడు కూడా రూ.40 లక్షలు మోసపోయారన్నారు. కనుక ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలలో ఇరుక్కోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌టెల్ కంపెనీ బాధ్యులు రవి, పవన్, కిరన్, తరుణ్, కావలి డిస్ట్రిబ్యూటర్ సోమిశెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, దృఢసంకల్పంతోనే లక్ష్యసాధన


ఉదయ్‌కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డి

కావలి(టౌన్), జూలై 23 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, దృఢ సంకల్పం లక్ష్యసాధనకు దోహద పడతాయని డిసిగ్నేటెడ్ ఐపీఎస్ ముల‌గాని ఉదయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జేబీ డిగ్రీ కళాశాల ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ఉదయ్‌కృష్ణారెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి ఆయనను శాలువా సత్కరించి మాట్లాడుతూ విశ్వోదయ పూర్వ విద్యార్థి సివిల్స్‌లో 350 ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు అర్హత సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

● పుల్లారెడ్డి నగర్‌లోని గొట్టిపాటి సమావేశ మందిరంలో యుపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కూరపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉదయ్‌కృష్ణారెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత రీజినల్ మేనేజర్ ప్రభాకర్ రెడ్డి, పారిశ్రామికవేత్త ధనుంజయరెడ్డి, జేబీ పీడీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌లకు యూనిఫాం అందజేత


ట్రాఫిక్ పోలీస్‌లకు యూనిఫాం అందచేస్తున్న డీఎస్పీ

కావలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో హోమ్‌గార్డులకు, ట్రాఫి క్ పోలీస్‌లకు యూనిఫాం, టోపీలు, కళ్ల అద్దాలు, గ్లౌజ్‌లు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ సమకూర్చిన వీటిని డీఎస్పీ పీ. శ్రీధర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో విధులు నిర్వహిస్తున్న పోలీస్‌సేవలను గుర్తించి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు రమేష్ యూనిఫాంలు, అద్దాలు, టోపీలు అందించటం అభినందనీయమన్నారు. రానున్న వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని పోలీస్ సిబ్బందికి ఆర్యవైశ్యసంఘం తరుపున రెయిన్‌కోట్‌లు అందచేయాలని డీఎస్పీ కోరారు. దీనిపై స్పందించిన ఆయన రెయిన్‌కోట్‌లు పంపిణీ చేసేందుకు తమ సంఘం సిద్ధంగానే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఫిరోజ్, గిరిబాబు, ఆర్యవైశ్యసంఘం నేతలు, వాసవీక్లబ్, సెవెన్‌లైన్స్ సభ్యులు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

కలిగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దారు ఎం గిరీష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెలగపాడు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లికివందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమపథకాల లబ్ధిదారుల జాబితా కార్యాలయం వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. సచివాలయానికి వచ్చే పౌరులపట్ల గౌరవభావం కలిగి విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తనూజ, వీఆర్వో రవి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం కందుకూరు మున్సిపాలిటీలోని 19వ వార్డులో సాయంత్రం నిర్వహించిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, సయ్యద్ సుల్తాన్, దండే శ్రీనివాసరావు, ముస్తాక్, మసూద్, హర్షత్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మేక్ ఏ ఛేంజ్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని జనార్దనకాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం నోట్‌పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రవ్వా శ్రీనివాసులు, గుర్రం చినఅల్లూరయ్య, చక్కా వెంకటకేశవ, పాఠశాల వైస్‌చైర్మన్ రామరాజు, ఉపాధ్యాయులు బి. పద్మజ, అత్తోట రమేష్, ఇర్షాద్ అహ్మద్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్


చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని అంతర్గత రహదారులన్నింటిని సీసీరోడ్లుగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని కావలిముస్తాపురం పంచాయతీ పరిధిలోని దంటుపాలెం ఎస్సీ కాలనీలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్ల నిర్మాణం కావాలని కోరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ఎమ్మెల్యే వద్దకు రాగా ఎలా చదువుతున్నారు.. పాఠశాలలో పూర్తిగా సౌకర్యాలు ఉన్నాయా, తల్లికివందనం నగదు జమ అయిందా తదితర విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచు పోలవరపు సుబ్బానాయుడు, మాలేపాటి జనార్దన్ నాయుడు, మాలేపాటి రమేష్, మద్దినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు మహారుద్రాభిషేకం

ఉలవపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : గ్రామ శ్రేయస్సు, దుష్ట పరిణామాల నుంచి సంరక్షణ కోసం కరేడు గ్రామంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో స్వామివారికి బుధవారం 17 మంది వేదపండితుల మంత్రోచ్చరణలతో మహారుద్రాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామివారి అభిషేకంలో పాల్గొని శివయ్య కృపకు పాత్రులయ్యారు. స్వామివారి తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ స్వీకరించారు.

ఓపెన్ స్కూల్ ప్రాధాన్యతపై అవగాహన


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో బ్రహ్మయ్య, ఎంఈవో నాగేశ్వరరావు, తదితరులు

జలదంకి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ స్కూల్ ఎన్రోల్‌మెంట్‌లో భాగంగా స్థానిక ఎంఈవో కార్యాలయంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లకు బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. బడిబయట 14 ఏళ్ల లోపు ఉన్న వారిని ఓపెన్‌స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేర్పించి వారిని విద్యావంతులను చేసేందుకు ఓపెన్ స్కూల్ ఉపయోగపడుతుందని ఎంఈవో నాగేశ్వరరావు పేర్కొన్నారు. తద్వారా వారు విద్యావంతులై చిన్న చిన్న కంపెనీలలో ఉద్యోగాలతో పాటు స్వశక్తితో వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం ఎంపీడీవో బ్రహ్మయ్య ఆంధ్రప్రదేశ్ విద్యాపీఠం గోడపత్రికను ఆవిష్కరించారు.

ఉలవపాడులో ‘బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ’

ఉలవపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం ఉలవపాడులోని దర్గా సెంటర్‌లో వైసీపీ శ్రేణులు బుధవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెలిచర్ల ధనకోటి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిశోర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల కొండయ్య, జీ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతల పూజలు

కావలి(టౌన్), జూలై 23(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం కలుగోళశాంభవి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆకలి ఫీట్లు...!!



సైకిల్ చక్రంలో కాళ్లుపెట్టి తాడుమీద నడుస్తున్నమహిళ



నోట్లో పెట్రోల్ పోసుకుని ఊదడంతో పెద్దఎత్తున రేగిన మంటలు

ఆకలి.. పేదవాడిని ప్రేమించే అనార్కలి!. అందుకేనేమో.. ఆ పేద కుటుంబాన్ని ఆకలి రాకాసి వెంటాడుతోంది. ఇంటిల్లిపాది చేత 'సర్కస్ ఫీట్లు' చేయిస్తోంది. రోడ్డు పక్కన.. మురికి కాల్వల చెంతన.. గుడారాలు వేసుకుని పిల్లా పాపలతో అత్యంత దయనీయంగా బతుకు సమరం సాగించే 'సంచార' జీవితాలు వాళ్లవి. మూడు పూటలా... ఐదు వేళ్లనూ నోట్లోకి పంపడం కోసం గాల్లో నిర్భయంగా పల్టీలు కొట్టే 'సాహసాల రాకెట్లు' వాళ్లు!. ఏ ఊరికెళితే.. అదే.. వాళ్ల చిరునామా.

ఈ ఒక్క పూటకు మాత్రం.. బుచ్చిరెడ్డిపాళెంలోని ఆ ప్రైవేటు పాఠశాలే.. వాళ్ల కడుపు నింపే 'అన్నదాన' కేంద్రమైంది. ఒళ్లు గగుర్పొడిచే ఆ విన్యాసాలు.. అక్కడి ఉపాధ్యాయులతోపాటు పిల్లల చేత కన్నీళ్లు పెట్టించాయి. చూసిన ప్రతి ఒక్కరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. కర్రను పది నిముషాల పాటు పళ్లపై నిలబెట్టే నైపుణ్యం... ఇరవై అడుగుల ఎత్తుండే రెండు కర్రలకు తాడు కట్టి.. చేతిలో ఇరవై అడుగుల కర్రను పట్టుకుని ముందుకు వెనక్కి నడిచే ఓ మహిళ సాహసం... సైకిల్ చక్రంలో కాళ్ళుపెట్టి దారంపైన నడిచే కళ.. గుడ్డతో చుట్టిన కాగడాకు నిప్పు పెట్టి.. ఆ మంటను చేతులపైన.. ముఖంపైన అద్దుకునే ఓ యువకుడి ధైర్యం.. నోట్లో పెట్రోలు పోసుకుని.. మంటలపై ఊదే గుండె ధైర్యం... నిజంగా.. ఆ సంచార జాతి బిడ్డల సొంతం! మనం వాళ్లకు ఇప్పుడు చెప్పాల్సింది 'హ్యాట్సాఫ్' కాదు... చేయాల్సింది శెల్యూటూ కాదు. కానీ.. ప్రభుత్వాలైనా.. పాలకులైనా.. బాధ్యత కలిగిన పౌరులెవరైనా.. తప్పకుండా చూపించాల్సిన 'మానవీయ' ధర్మం మాత్రం ఒకటుంది.. అదే.. ఆ ఇంటిల్లిపాదికీ కొన్ని నెలల పాటు కడుపు నింపే 'ఉపాధి' మార్గం! మనసున్న దాతృత్వం. అదే.. మనుషులుగా మన అసలైన కర్తవ్యం.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



ఔషధ నియంత్రణ చట్టాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, అసోసియేషన్ నేతలు

ఔషధ చట్టాలపై అవగాహన అవసరం

నెల్లూరు (వైద్యం) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఔషధ చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్(డీసీఏ) పీ. రమేష్ తెలిపారు. బుధవారం నగరంలోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఔషధ చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఎక్స్ ఔషధాలు, హయ్యర్ యాంటీబయాటిక్స్ వాడటం వల్ల భవిష్యత్తులో తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వైద్యుల సలహా లేకుండా వీటిని వాడకూడదని ఆయన చెప్పారు. మత్తు మందులు దుర్వినియోగం కాకుండా అందరూ జాగ్రత్తలు వహించాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఔషధ నియంత్రణ చట్టాలపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తి పవిత్ర, కావలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటకృష్ణ, సంతపేట సీఐ దశరథరామయ్య, నెల్లూరు కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు సీసీఆర్‌సీ దక్కేనా?

- ఈ ఏడాది 38వేల కార్డుల లక్ష్యం
- అపోహలతో ముందుకు రాని భూ యజమానులు
- పథకాలు దక్కాలంటే ఆ కార్డు తప్పనిసరి
- కొందరు ససేమిరా...

నెల్లూరు(వ్యవసాయం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న కౌలు రైతులకు పంట చేతికొచ్చినా లాభం మాత్రం ఉండడం లేదు. ఫలసాయం అమ్ముకున్న తర్వాత అప్పులు తీర్చేస్తే చాలనుకునే పరిస్థితిలో ఉన్నారు. దీనికితోడు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయంతోపాటు ఇతర రాయితీ పథకాల లబ్ధి దక్కడం లేదు. ఈ నేపథ్యంలో కౌలు రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డులు అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈఏడాది 38వేల కార్డులు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే 3వేలకుపైగా కార్డులు మంజూరు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. 33వేల కార్డులు రెన్యువల్ చేసుకోవాల్సి ఉండగా మరో రెండు వేల వరకు ఇవ్వాల్సి ఉంది.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీకి వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే కొంత మంది భూయజమానులు ఇందుకు అంగీకరించేందుకు ముందుకు రావడం లేదు. భూమిపై తమ హక్కు పోతుందని, ప్రభుత్వం నుంచి లభించే రాయితీలు, పథకాలు కోల్పోతామనే అపోహతోనే భూయజమానులు ఆసక్తి చూపడం లేదు. దీనిపై అధికారులు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



జిల్లాలో కౌలు రైతుకు జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డు

3,005 కార్డులిచ్చాం

జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి 38 వేల సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటి వరకు 3005 కార్డులు ఇచ్చి ఉన్నాం. 552 మంది కౌలు రైతులకు పంట రుణాలు కూడా ఇచ్చారు. దాదాపు 33వేల కార్డులు రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది. సీసీఆర్‌సీతో ఎంతో ప్రయోజనం ఉంది. భూయజమానులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కువ మంది యజమానులు ఒప్పుకుంటున్నారు. కొంత మంది అపోహలతో ముందుకు రావడం లేదు.



- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

ప్రాణం ఉన్నంత వరకు కరేడు రైతులకు అండగా...

- బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

ఉలవపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : నా ప్రాణం ఉన్నంత వరకు కరేడు రైతులకు అండగా ఉంటానని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం కరేడు పంచాయతీ పరిధిలోని 16 శివారు గ్రామాల నుంచి కులమతాలకు అతీతంగా నాలుగు బస్సులు, కార్లలో పురుషులు, మహిళలు సుమారు 250 మంది రామచంద్ర యాదవ్ స్వగ్రామం చిత్తూరు జిల్లా పుంగనూరుకు వెళ్లి ఆయనను కలిసి కరేడు భూ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కరేడు రైతులకు ప్రత్యక్షంగా మద్దతు తెలిపి వారి పోరాటంలో పాలుపంచుకున్నారని, కొందరు తెలియక చేసిన తప్పిదానికి గ్రామస్థులను మన్నించాలని కోరారు. దీంతో రామచంద్రయాదవ్ మాట్లాడుతూ తక్కువ సమయంలోనే కరేడు రైతులతో అనుబంధం ఏర్పడిందని, వారికి ఇష్టం లేకుండా ప్రభుత్వం, నాయకులు సెంటు భూమి కూడా తీసుకోకుండా ప్రత్యక్ష ఉద్యమంలో స్వయంగా పాల్గొంటానన్నారు. గ్రామస్థుల మధ్య ఐకమత్యాన్ని విడగొట్టి విడతల వారీగా భూములు కాజేయాలని కుట్ర చేస్తూ జిల్లా కలెక్టర్‌తో 4,800 ఎకరాల భూముల సేకరణపై జీవో ఇప్పించారన్నారు. అధికారులు, నాయకుల మాయమాటలకు ఎవరూ తలొగ్గదని, ముఖ్యంగా మత్స్యకారులతో కలిపి కలిసికట్టుగా పోరాడితేనే మీ భూములు కాపాడుకోగలరని, మీ పోరాటానికి నాప్రాణాలు అడ్డువేస్తానని ప్రమాణం చేశారు.



రామచంద్ర యాదవ్‌ను కలిసిన కరేడు రైతులు

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

నెల్లూరు (వైద్యం), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సెలక్షన్ కమిషన్ ద్వారా నియామకం జరిగి, 20 ఏళ్ల ఆరోగ్యసేవలు అందించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లో తీసుకోవాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హంస నాయకులు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందించారు. అనంతరం చేజర్ల మాట్లాడుతూ కోర్టు ఆదేశాలతో హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించటం వల్ల వారి ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు అర్హతను బట్టి కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఆఫీస్ సబార్డినేట్లుగా దీర్ఘకాలం పని చేస్తున్న వారికి ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలకు వేతనాలు అందేటట్లు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా కోశాధికారి శేషగిరి రావు, ఉపాధ్యక్షుడు మజాహర్, నాయకులు మురళీ, నాగరాజు, గౌస్‌బాషా, లక్ష్మీకాంతమ్మ, మంజరి పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో కరేడు యువకులు?

ఉలవపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం కేసులో కరేడు యువకులు ఇద్దరిని తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారన్నట్లు సమాచారం. సేకరించిన వివరాల మేరకు.. తిరుపతి జిల్లా వరదయ్యపాలెం వద్ద వారం రోజుల క్రితం పోలీసులు తనిఖీల్లో ఎర్రచందనం తరలిస్తున్న బొలేరో వాహనం పట్టుబడింది. ఆ వాహనాన్ని కరేడుకు చెందిన వినోద్‌రెడ్డి అనే యువకుడు నడుపుతూ పట్టుపడ్డాడు. దీంతో ఎర్రచందనం స్మగ్లింగ్‌లో కరేడుకు చెందిన వడ్రంగి కుటుంబానికి సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో ఆ కుటుంబంలోని ఓ యువతిని గత రెండు రోజులుగా ఉలవపాడు పోలీస్ స్టేషన్‌లో విచారించారు. ఈ క్రమంలో బుధవారం కరేడుకు చెందిన బడితల అశోక్, చింతం శ్రీహరిని తిరుపతి జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం అశోక్‌ను వదిలిపెట్టి శ్రీహరిని మాత్రం తిరుపతికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీనిపై పూర్తిస్థాయి సమాచారం చెప్పేందుకు స్థానిక పోలీసులు తమ పరిధిలోనిది కాదన్నట్లు వ్యవహరిస్తుండటం, బయట జిల్లా పోలీసులు వివరాలు చెప్పేందుకు నిరాకరించడంతో ఏం జరుగుతుందో తెలియడం లేదు.

బోగోలు పంచాయతీ కార్యదర్శిపై విచారణ

బిట్రగుంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ జహీర్‌పై కావలి డీఎల్పీవో వెంకటరమణ బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బహిరంగ విచారణ చేపట్టారు. పంచాయతీలో పన్నుల వసూళ్లతోపాటు వివిధ ఖర్చులలో నగదు దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ఆ పంచాయతీ మాజీ ఉపసర్పంచు వీరరఘు జిల్లా కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్పీవో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సమాచార చట్టం ద్వారా పంచాయతీ కార్యదర్శి నుంచి తీసుకున్న పలు ఖర్చులపై వివరణ ఇవ్వాలని ఫిర్యాదుదారుడు కోరారు. వసూలు చేసిన పన్నులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు స్థానికుల సమక్షంలో రుజువు చేయించాలని డిమాండ్ చేశారు. పన్నుల పేరుతో కొందరి నుంచి ఎక్కువ మొత్తం సిబ్బంది ఫోన్‌పేకి వేయించి తరువాత తన ఫోన్‌పేకి బదిలీ చేయించుకున్నారని ఆరోపించారు. ట్రాక్టర్‌కు రోజుకు రూ.1000 డీజిల్ ఖర్చు ఏవిధంగా అవుతుందని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన అన్ని లెక్కలతో ఎంబుక్కులు సిద్ధంగా ఉన్నాయని కార్యదర్శి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ విచారణకు సంబంధించిన సమగ్ర నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తానని, వారి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎల్పీవో కార్యాలయ ఏవో వెంకటసురేష్, జడ్పీటీసీ కీర్తన, వార్డు సభ్యులు, మాజీ సర్పంచు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ విచారణ చేస్తున్న డీఎల్పీవో వెంకటరమణ



టీడీపీ కార్యకర్తలకు చెక్కుల పంపిణీలో మంత్రి నారాయణ, రమాదేవి దంపతులు

తాగునీటి ప్రాజెక్టులకు రూ.120 కోట్ల మంజూరు

- డిసెంబరు నాటికి ప్రతి ఇంటికి మంచినీరు
- సొంతనిధి ద్వారా కార్యకర్తలకు ఏటా రూ.10 కోట్లు
- పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు (వైద్యం) జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి ప్రాజెక్టుల కోసం రూ. 120 కోట్లు విడుదల అయ్యాయని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. బుధవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి 175 మంది కార్యకర్తలకు రూ. 45 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఇంటికి డిసెంబరు నాటికి సంగం నుంచి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. డ్రైన్‌ల మరమ్మతులు, కొత్తడ్రైన్‌ల ఏర్పాటు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రూ. 50 కోట్లతో మేజర్ కెనాల్స్ రివిట్‌మెంట్ ప్రారంభించామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఆక్రమణదారులకు ఎవరూ వత్తాసు పలక వద్దని హితవు పలికారు. మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రానికి 5 స్వచ్ఛ అవార్డులు వచ్చాయంటే, అందుకు మంత్రి నారాయణే కారణమని తెలిపారు. నమ్ముకున్న కార్యకర్తలను ఆదుకునేందుకు మంత్రి నారాయణ ఏటా సొంత నిధులలో రూ.10 కోట్లు కేటాయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మందులు తడిస్తే మాకేంటి ?

వర్షాలకు చెమ్మతో పాడైపోతున్నాయ్

నెల్లూరు (వైద్యం) జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగా విలువైన మందులు వర్షాల పాలవుతున్నాయి. జిల్లాలోని 52 పీహెచ్‌సీలతోపాటు 29 సీహెచ్‌సీలకు సరఫరా చేయాల్సి మందులు డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరాయి. వీటిని అక్కడే భద్రపరిచి ఆయా ఆరోగ్య కేంద్రాలకు చేరవేస్తుంటారు. అయితే ఆయా మందులు, ఇంజక్షన్‌లు కార్యాలయం ఆవరణంలో ఉంచడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు అవి తడుస్తున్నాయి. మందులు దాచుకోటానికి వైద్య ఆరోగ్యశాఖలో గదుల కొరత ఉన్నా మొదటి, రెండవ అంతస్థుల్లోని వరండాల్లో వీటిని ఉంచవచ్చు. అయితే పై వరకు తీసుకు వెళ్లటానికి బద్దకం కారణంగా మందులు తడుస్తున్నాయి.



వర్షపునీటిలో తడుస్తూ వరండాలో ఉన్న మందుల పెట్టెలు

నెల్లూరులో వీవో కొత్త ఫోన్ల ఆవిష్కరణ

- పాల్గొన్న నటి పూజిత పొన్నాడ

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సెల్‌ఫోన్ తయారీ సంస్థ వీవో నూతనంగా విడుదల చేసిన వీవో ఎక్స్ ఫోల్డ్ 5, వీవో ఎక్స్ 200 ఎఫ్ఈ మోడళ్లను నెల్లూరు మార్కెట్‌లోకి విడుదలయ్యాయి. 'హరిహర వీరమల్లు' సినిమా ఫేమ్ పూజిత పొన్నాడ, బీన్యూ మొబైల్స్ సంస్థ సీఈవో సాయి నిఖిలేష్, మేనేజింగ్ డైరెక్టర్ సాయినితీష్, వీవో జనరల్ మేనేజర్ అతిష్ భార్గవ, డిప్యూటీ జనరల్ మేనేజర్ రెడ్డి వసంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త మోడళ్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ పూజిత మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా వీవో సంస్థ వివిధ మోడళ్లను విడుదల చేయడం అభినందనీయమన్నారు. బీన్యూ సీఈవో సాయినిఖిలేష్ మాట్లాడుతూ నెల్లూరుకు బీన్యూ మొబైల్స్ సంస్థకు ఎంతో అనుబంధం ఉందన్నారు. తన తండ్రి బాలాజీ చౌదరి నెల్లూరు నుంచి వాచ్‌ల విక్రయంతో వ్యాపారాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 150 స్టోర్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా లాప్‌టాప్, కూలర్స్, ఏసీలతోపాటు ఇతర ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. వీవో నూతన మోడళ్లను ప్రిబుక్ చేసుకున్న వినియోగదారులకు పూజిత పొన్నాడ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో బీన్యూ, బాలాజీ సంస్థ ఉద్యోగులు, వీవో సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





డీఆర్సీ సమావేశంలో ముచ్చటించుకుంటున్న మంత్రులు ఫరూక్, ఆనం

డీఆర్సీలో ఎవరేమన్నారంటే..

నెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు తమ ప్రాంత సమస్యలపై సమావేశంలో ప్రస్తావించారు.

ఇకపై ముందుగానే చెప్తారు



దీపం పథకం అర్హులైన మహిళలందరికీ ఉచితంగా సిలిండర్లు అందిస్తున్నాం. ఇందుకు సంబంధించిన సబ్సిడీ నగదును మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. అయితే ఈ విషయం కొంత మంది మహిళలకు తెలియడం లేదని చెబుతున్నారు. ఈ విషయాన్ని గత క్యాబినెట్ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు చర్చించారు. ఇకపై సబ్సిడీ డబ్బులు మొత్తాన్ని మహిళలందరి ఖాతాల్లో ఒకేసారి వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు డబ్బులు పడతాయన్నది ఇకపై ముందుగానే చెప్తారు.

- పొంగూరు నారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి

సభా మర్యాదలు పాటించాలి



నెల్లూరు డీఆర్సీ సమావేశాలు చాలా హుందాగా జరుగుతుంటాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ డీఆర్సీ అధ్యక్షుడు చెప్పినట్లుగానే సమావేశం నడుస్తుంది. కోపం, బాధ వచ్చినా అందరూ సభా మర్యాదలు పాటిస్తూ వచ్చేవారు. కానీ ఇప్పుడు ఆ సభా మర్యాదలు వదిలేసి తూమాటి మాధవరావు మాట్లాడటం సరైనది కాదు. మేము 40 ఏళ్లుగా అధ్యక్షులు చెప్పినట్లే నడుచుకుంటున్నాం. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరించడానికి ఇది డీఆర్సీ సమావేశం.. మరొకటి కాదు.

- ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ మంత్రి

మానిటరింగ్‌తో నీరు తెచ్చుకోవాలి



కృష్ణా పరివాహకంలో వరదలు వస్తున్నాయి. పోతిరెడ్డిపాడు ద్వారా శ్రీశైలం నుంచి నీటిని సోమశిలకు తీసుకొచ్చేందుకు అవకాశం ఏర్పడింది. గతేడాది మానిటరింగ్ చేసి రెండు సీజన్లకు సరిపడేంత నీటిని తీసుకొచ్చాం. ఇప్పుడు కూడా అదే మాదిరిగా రెగ్యులర్‌గా మానిటరింగ్ చేసి రాబోయే సీజన్‌కు ఇబ్బంది లేకుండా నీటి నిల్వలు పెట్టుకోవాలి. కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారం రోజులైనా ఎందుకు బాగు చేయలేకపోతున్నారు..? యూరియా కొరత రానీయకుండా చర్యలు తీసుకోవాలి.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

యూరియా కొరత సృష్టిస్తే కేసులు



ప్రభుత్వం నుంచి యూరియా సరఫరా విషయంలో ఎటువంటి సమస్య లేదు. నిబంధనల మేరకు రైతులకు యూరియాను అందిస్తున్నాం. మెట్ట ప్రాంతాల్లో జామాయిల్‌కు అవసరం లేకపోయినా రైతులు యూరియాను వేస్తుండడంతో సమస్య తలెత్తుతోంది. యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. యూరియాను అనధికారికంగా నిల్వ చేసినా, బ్లాక్ మార్కెట్లో ఎక్కువ ధరకు విక్రయించినా క్రిమినల్ కేసులు పెడతాం. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నాయి.

- ఓ ఆనంద్, జిల్లా కలెక్టర్

రాళ్లపాడుకు 1.50 టీఎంసీలివ్వాలి



అందరి సహకారంతో రాళ్లపాడు జలాశయం కింద గతేడాది పంటలు పండించగలిగాము. ఈ ఏడాది కూడా అలానే జరగాలని కోరుకుంటున్నాం. అయితే ఇంకా రాళ్లపాడు డీప్‌కట్ పూర్తి చేయలేదు. త్వరగా పూర్తి చేసి రాళ్లపాడుకు నికరంగా 1.50 టీఎంసీల నీరు ఇవ్వాలి. ఈ ప్రాజెక్టు వద్ద పర్యవేక్షణకు పది మంది ఏఈఈలు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు. వీరొక్కరు ఎలా పర్యవేక్షిస్తారు..? డిప్యుటేషన్‌పై సిబ్బందిని నియమించాలి. రాళ్లపాడు జలాశయం, కాలువల్లో పాత గేట్లను బాగు చేయాలి.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

సబ్ కెనాల్స్ పునరుద్ధరించాలి



మా నియోజకవర్గం ఇరిగేషన్ విషయంలో వివక్షకు గురైంది. పక్కనే కాలువల్లో నీరు పారుతున్నా ఆ నీటిని రైతులు ఉపయోగించుకోలేని దయనీయ పరిస్థితులు ఉన్నాయి. ఈ మెయిన్ కెనాల్స్ నుంచి గతంలో సబ్ కెనాల్స్ ఉండేవి. కానీ ఏ కారణాలతో ఆ సబ్ కెనాల్స్‌ను మూసేశారో తెలియదు. వెంటనే సబ్ కెనాల్స్‌ను పునరుద్ధరించాలి. గండిపాలెం జలాశయానికి హెడ్ ఆఫ్ అకౌంట్ కూడా లేదు. దీంతో చిన్న చిన్న పనులు కూడా చేయలేకపోతున్నారు. మెట్ట ప్రాంతాల్లో అగ్రికల్చరల్ అసిస్టెంట్ల కొరత లేకుండా చూడాలి.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

యూరియా కొరతతో అవస్థలు



యూరియా కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా వారికి సరిపడా యూరియాను అందించాలి. సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా అన్నదాత సుఖీభవ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. పీఏసీఎస్‌ల ద్వారా గతంలో ధాన్యం కొనుగోళ్లు చేయగా, అందుకుగానూ ఇంత వరకూ కమీషన్లు ఇవ్వలేదు. దీని మూలంగా అక్కడ సిబ్బందికి జీతాలు ఇవ్వడం కూడా కష్టమైంది. కమీషన్లు చెల్లిస్తేనే వచ్చే సీజన్లో పీఏసీఎస్‌లలో ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందుల తలెత్తవు.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

ఈ-క్రాప్ చేయకపోతే ఎలా?



మరో నెల రోజుల్లో వరి కోతలు మొదలవుతాయి. కానీ ఇప్పటికీ మా నియోజకవర్గంలో ఈ-క్రాప్ నమోదు ప్రారంభం కాలేదు. సచివాలయాల్లో అగ్రికల్చరల్ అసిస్టెంట్ల కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించి త్వరగా పూర్తి చేయాలి. ధాన్యం ఏఏ కేంద్రాల్లో కొనుగోలు చేస్తారో ముందుగానే రైతులకు అవగాహన కల్పించాలి. ఇప్పటి నుంచే మిల్లర్లతో చర్చించి బీజీలు తీసుకోవాలి.

- దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే